AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 5, Issue: 31 May - 2009

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

## మన జీవిత పయనమెటు?

## విజయ పథంలో భారత ప్రజాస్వామ్య రథం



## శీల సంపదే ముఖ్యమని మరువబోకుమా

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

قَوْلٌ مَّعْرُوفٌ وَمَغْفِرَةٌ خَيْرٌ مِّن صَدَقَةٍ يَتْبَعُهَا أَذًى

(سورة البقرة: ٢٦٣)



దానం చేసిన మీదట గ్రహీత మనసును
నొప్పించటం కన్నా మృదువుగా మాట్లాడటం,
మన్నింపుల వైఖరిని అవలంబించటం మిన్న.

(దివ్య ఖుర్‌ఆన్ - 2: 263)

# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 31
MAY 2009

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN



Noushad Zainulabdeen

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait

PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT




## ఈ సంచికలో....

| | |
|---|---|
| విజయపథంలో ప్రజాస్వామ్యరథం | 2 |
| ఆయనకన్నీ సుసాధ్యమే | 3 |
| సామాజిక న్యాయం ఎక్కడ ? | 4 |
| యా అల్లాహ్ ! | 5 |
| అనురాగ గోపురం | 6 |
| ఆలోచించండి | 7 |
| అంతిమ హజ్ యాత్ర | 8 |
| మన జీవిత పయనమెటు? | 9 |
| దైవ కానుక ఇస్లాం | 10 |
| మస్జిదుల గురించి... | 12 |
| సీరత్ క్విజ్ | 13 |
| ఇంతకీ ఆ ఒక్క దేవుడు ఎవరు? | 13 |
| శీల సంపద | 14 |
| ధర్మ సందేహాలు | 15 |
| నిజ స్నేహితుడు | 16 |
| కలిమి + లేమి = జీవితం | 18 |
| చెట్టు పుట్ట... | 19 |
| నెలవంక ఉత్తరాలు | 20 |

5



18



❖ كلمة العدد ❖ إن الله يفعل ما يريد ❖ أين العدل الاجتماعي؟ ❖ يا الله.. (التشيد) ❖ البيت المثالي
❖ لعلكم تتفكرون ❖ تلخيص الرحيق المختوم ❖ إلى أين نحن؟ ❖ نعمة الله الغالية الإسلام
❖ مكانة المساجد في الإسلام ❖ الأسئلة عن السيرة ❖ من هو الخالق؟ ❖ العفة....
❖ الفتاوى الشرعية ❖ الصديق الحميم ❖ لا تسجدوا للشمس.... ❖ الحياة بين الحزن والفرح ❖ رسائل...



# విజయ పథంలో భారత ప్రజాస్వామ్య రథం

**ఆదరణీయులైన నెలవంక పాఠకులకు,**

ఈ పంక్తులు రాసే సమయానికి మన దేశ లోక్‌సభకు మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ సహా మరి కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా పనిలో పనిగా ఎన్నిక నిర్వహించ బడుతోంది.

మనం మన దేశానికి వేల మైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ మానసికంగా అతి సమీపంలో ఉన్నాం. ఎలక్ట్రానిక్ మీడియా అభివృద్ధి చెందటం వల్ల ఎప్పటికప్పుడు మనం ఎన్నికల భారతాన్ని వీక్షిస్తున్నాం, విశ్లేషించుకుంటున్నాం, ఫలితాలపై కాకి లెక్కలు కూడా వేసుకుంటున్నాం.... మే 16 వ తేదీన గాని ఎవరి జాతకం ఏమిటో తేలదు.

మన ప్రజాస్వామిక వ్యవస్థలో అనేక లొసుగులున్నప్పటికీ ఇందలి విశిష్టతను ఒప్పుకోక తప్పదు. మానవ మాత్రులు నిర్మించుకున్న ఆధునిక పరిపాలనా వ్యవస్థలో కాస్తో కూస్తో మెరుగైనది ప్రజాస్వామిక వ్యవస్థే. అందులోనూ జనాభా పరంగా ప్రపంచంలోనే రెండో పెద్ద దేశమైన ఇండియాలో ఈ ప్రజాస్వామ్యం బలంగా వ్రేళ్లానుకోవటం ఆషామాషీ వ్యవహారం కాదు. విభిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, కులాలు, వర్గాలు, సిద్ధాంతాలు గల దేశ ప్రజలు 'ప్రజాస్వామ్యం' అనే ఒక పూలదండలో చక్కగా ఇమిడిపోవటం, అరవై యేండ్లుగా ఈ పూలదండలోని దారం తెగకుండా ఉండటం గొప్ప విషయం.

ఈ సారి ఎన్నికల్లో మత, వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టే నాయకులను ఎన్నికల కమీషన్ కటకటాల వెనక్కి పంపడం, భారీ ఎత్తున నోట్ల కట్టల్ని స్వాధీనం చేసుకోవటం, పోలింగ్ స్టేషన్ల వద్ద మునుపటికన్నా మెరుగైన బందోబస్తును ఏర్పాటు చేయడం కూడా హర్షించదగిన పరిణామాలే. ఈ లెక్కన గనక ఎలక్షన్ కమిషన్ కొరడా ఝుళిపిస్తూపోతే భావిలో మరిన్ని సత్ఫలితాలొస్తాయని ఆశించవచ్చు.

గత ఆరు దశకాల భారత రాజకీయ చిత్రపటాన్ని చూస్తే ఒక విషయం స్పష్టంగా అవగతమవుతుంది– అడపాదడపా కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ 'అస్థిరత' ఏర్పడినప్పటికీ మొత్తమ్మీద రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ నడిచింది. 20 మాసాల ఎమర్జన్సీ సంకెళ్ళను త్రెంచుకున్న భారతీయులు బ్యాలెట్ బాక్సుల ద్వారా (1977 మార్చిలో) నిశ్శబ్ద విప్లవం తీసుకువచ్చారు. బ్రూట్ మెజారిటీతో అందలమెక్కిన వారెలాగూ ఐదేళ్ళు పాలిస్తారు. అయితే అత్తుబొత్తు మెజారిటీతో అధికార పగ్గాలు చేపట్టిన అతుకుల బొంత పార్టీలు కూడా 'సుస్థిరత' విషయంలో తామెవరికీ తీసిపోమని నిరూపిస్తున్నాయి. 1999లో హస్తినలో అధికారం కైవసం చేసుకున్న ఎన్.డి.ఎ అయినా, 2004లో అధికార స్థానంలో ఆసీనులైన యు.పి.ఎ అయినా పూర్తిగా ఐదేళ్ల పరిపాలించటం విశేషమే.

పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక లాంటి చిట్టిపొట్టి దేశాలు తీవ్రమైన సంక్షోభంతో, అస్థిరతతో సతమతమవుతుండగా పటిష్టమైన ప్రజాస్వామిక దేశంగా భారత దేశం ముందుకు దూసుకుపోవటం శుభ సూచకం. అయితే "ప్రజాస్వామ్యం ఒక మూకల పాలన" (Democracy is the rule of mob) అన్న అరిస్టాటిల్ వ్యాఖ్యానం మనకు వర్తించకుండా జాగ్రత్త పడాలి. అవినీతి, లంచగొండితనం, అవకాశవాదం, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి లాంటి రుగ్మతలు నిరోధించబడిన నాడు మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థ యావత్ప్రపంచానికే మార్గదర్శకం కాగలదు.







ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com


**ఒక** బిందువు. అందులో కంటికి నేరుగా కానరాని క్రిములు. వాటిలో నుంచి ఎన్నికయిన ఒక క్రిమి. గోరంతది పండి, పిసరంతయి, రక్తపు ముద్దలో తడిసి, మాంసపు ముద్దగా తయారయి, ఎముకల గూడు కట్టుకుని, కండరాలు తొడుక్కుని, వేలెడంతది పెరిగి జానెడంతయి, మూరెడంతయి, మారు పలకని స్థితి నుండి మారాము చేసేంతగా ఎదిగి ఇప్పుడు కన్నెర్రజేస్తోంది ఈ ప్రాణి- మానవుడనే ఈ జీవి!

# ఆయనకన్నీ సుసాధ్యమే !



భువిలోని జీవరాసుల్లా ప్రకృతి ధర్మాలకు లోబడిన శరీరమే మానవ శరీరం. మనిషి నలువైపులా సంచరిస్తాడు. తన మనుగడకై అనునిత్యం శ్రమిస్తాడు. బ్రతుకు తెరువుకై అనుదినం గాలిస్తూ తిరుగుతాడు. కష్టపడనిదే ఇష్టమయిన తిండి సంపాదించ లేడు.

అయితే మనిషిదో ప్రత్యేకత.

మరే జీవికీ లేని బుద్ధివివేకాలున్నాయతనికి ఆలోచించగలడు. మంచీ చెడుల మధ్య విచక్షణ చూపగలడు. తనకు నచ్చిన బాటను ఎన్నుకోగలడు. తామెచ్చిన దాన్ని తన సొంతం చేసుకోగలడు. సృష్టిరాసిపై ఒకింత అదుపు, ప్రకృతి శక్తులపై ఒకింత ఆధిపత్యం అతనికి ఉన్నాయి.

బుద్ధిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రకృతి రహస్యాలను తెలుసుకోగలడు. వాదోప వాదాలు చెయ్యగలడు. తోటి మనుషులతోనే కాదు చివరికి తన సృష్టికర్తతోనూ వాదించడానికి తయారవుతాడు. తలెత్తి ప్రశ్నిస్తాడు.సవాళ్ళు విసురుతాడు. తనకున్న పరిమిత శక్తులనే అపారమయినవిగా, అఖండనీయమయినవిగా తలపోస్తాడు. 'ప్రచండ శక్తి మాన్యుడ'నయిన తాను చెయ్యలేనిది మరే శక్తి సాధించగలదని విర్రవీగుతాడు.

'నేనే ఓ మృత జీవిని బ్రతికించలేనపుడు మరే శక్తికయినా అది ఎలా సాధ్యమవుతుంది' అని సవాలు చేస్తాడు. ఎగతాళి చేస్తాడు. కాని తన్ను గురించి, తన పుట్టుకను గురించి, తన వాస్తవిక స్థితిని గురించి ఓ క్షణం ఆలోచించడు. మనిషి అవలంబించే ఈ దౌర్భాగ్యపు వైఖరినే ప్రభువు ప్రస్తావిస్తున్నాడు:

"మానవుడు చూడటం లేదా - మేము అతన్ని రేతస్సు నుండి సృజించగా ఆపైన అతను వచ్చి జగడాలకోరుగా తయారయ్యాడే! ఇప్పుడతను మాకు పోలికలు ఆపాదిస్తున్నాడు. 'కృశించిపోయిన ఈ ఎముకల్ని తిరిగి బ్రతికించేవాడెవడు' అని ప్రశ్నిస్తున్నాడు. అతనితో చెప్పండి, 'ఎవరైతే వాటిని ప్రప్రథమంగా (అవి లేనప్పుడు) సృజించాడో ఆయనే వాటిని బ్రతికిస్తాడు. ఆయన సృష్టికి సంబంధించిన ప్రతి విషయం తెలిసినవాడు' అని."

(యాసీన్:77-79)

అబూ అతీఖ్

# సామాజిక న్యాయం ఎక్కడుంది?



మానవుని మౌలిక హక్కుల్లో ముఖ్యమైనది సమానత్వపు హక్కు. మానవత రీత్యా అందరూ సమానులే. ఎవరికీ ఎవరిపైనా ఎలాంటి ఆధిపత్యం లేదు. సామాజిక, రాజకీయ, ధార్మిక రంగాలలో ఇస్లాం ఏ విధంగా సమానతల శిక్షణ ఇచ్చిందో, మరే విధంగా అది నిమ్నోన్నతా భావనలను, వర్ణ వివక్షా ధోరణులను ఖండించిందో తెలిసిందే. వాస్తవానికి ఏ మత ధర్మంలోనూ నిమ్నోన్నతలను ఇంత నిర్ద్వందంగా ఖండించిన ఉదాహరణ కానరాదు. ప్రజాస్వామిక రంగంలో నేటి ప్రపంచం ఎంతో పురోగమించినప్పటికీ, జాత్యహంకారం నేరమని అంతర్జాతీయ స్థాయిలో ఖరారైనప్పటికీ, ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో ఇప్పటికీ జాత్యహంకార జాడ్యం పోలేదు. కమ్యూనల్ అవార్డు ప్రకటించబడినా, రిజర్వేషన్లు ప్రవేశపెట్టబడినా కులాల తిక్క మాత్రం ఇప్పటికీ వదల్లేదు. ముస్లింలు సైతం కుల, వర్గ తెగల విషకోరల్లో చిక్కుకుని ఉన్నారన్న ఆరోపణలు పూర్తిగా సత్య దూరం కావు. కాని ముస్లింలకు – ఇతర జాతుల వారికి మౌలికంగా ఇక్కడ ఒక వ్యత్యాసం ఉంది. హైందవ సమాజంలోని వర్ణ వ్యవస్థ మతపరమైన అంశం. హిందూ మత గ్రంథాలలో, స్మృతులలో దీని గురించి స్పష్టంగా చెప్పబడింది. బైబిల్‌ను నమ్మేవారి దృష్టిలో కూడా ఇస్రాయీలీయులకు – ఇస్రాయీలీయేతరులకు మధ్య గల వ్యత్యాసం మత సంబంధమైన వ్యత్యాసంగానే పరిగణించబడుతుంది. నేడు పాశ్చాత్య దేశాలలో నల్లవారికి – తెల్లవారికీ మధ్య జరిగే ఘర్షణలకు గల ప్రధాన కారణాలలో ఇది కూడా ఒకటి. నల్లవారిని అక్కడ ఇస్రాయీలీయులుగా జమకట్టరు.

అయితే ఇస్లాంలో మాత్రం సైద్ధాంతికంగా, మతపరంగా జాతి విచక్షణకు, వర్ణ వ్యవస్థకు, నిమ్నోన్నతలకు ఎలాంటి తావు లేదు. ఒకవేళ ప్రపంచంలో ఏ మూలనైనా ముస్లింలలో ఈ రోగం ప్రబలితే అది సావాస దోషం మాత్రమే. నిజానికి ఇదొక సామాజిక రుగ్మత. సామాజిక రుగ్మతలను, సాంప్రదాయకమైన దురాచారాలను సంస్కరించటం ఏమంత కష్టం కాదు. కాని సైద్ధాంతికమయిన, మతపరమయిన చెడుగులను రూపుమాపటం చాలా కష్టం.

సమానత్వం,సౌభ్రాతృత్వాల స్థాపనకై మహనీయ ముహమ్మద్ (స) ఇచ్చిన సందేశం ఆయన సహచరుల మనసుపై చెరగని ముద్ర వేసింది."అజ్ఞాన కాలపు అహంభావాలు నా పాదాల క్రింద ఉన్నాయి" అని ఆయన ప్రవచించటం ద్వారా గానీ, "ఒక నల్లవానికి తెల్లవానిపై గానీ, ఒక తెల్లవానికి ఒక నల్లవానిపై గానీ ఎలాంటి శ్రేష్ఠతకు, ఆధిక్యతకు ఆస్కారం లేదు" అని నొక్కి వక్కాణించటం వల్ల గానీ అనుయాయుల గుండెల్లో గూడు కట్టుకుని ఉన్న అసమానతా భావాలు పటాపంచలై పోయాయి. మనసులోని మాటను వెలిబుచ్చేటప్పుడు ఒక సగటు ముస్లిం కూడా సమకాలీన చక్రవర్తికి జడిసేవాడు కాదు. అలాగే చక్రవర్తి సైతం సామాన్య జనులు నిలిచే బోనులో నిలబడి జవాబు చెప్పుకోవడానికి కించిత్ అసహనానికి గురయ్యేవాడు కాదు.

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) పరిపాలనలో ఉబై బిన్ కాబ్ (ర) న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ రోజుల్లోనే స్వయంగా ఖలీఫాకు వ్యతిరేకంగా కేసు నమోదయింది. ఒక నిందుతునిగా ఖలీఫా న్యాయస్థానంలో నిలబడవలసి వచ్చింది. ఖలీఫా న్యాయస్థానానికి వచ్చినప్పుడు ఆయన గౌరవార్థం న్యాయమూర్తి ఉబై (ర) లేచి నిలబడ్డారు. ఈ ధోరణి ఖలీఫాకు నచ్చలేదు. "న్యాయాధీశా! ఇది మీ పక్షపాత వైఖరికి మొదటి నిదర్శనం" అని మొహం మీదే చేప్పేశారు. ఖలీఫాపై మోపబడిన ఆరోపణలకు గాను సాక్ష్యాధారాలు కోరబడ్డాయి. సాక్ష్యాధారాలను సమర్పించటంలో ఆరోపించేవారు విఫలురయ్యారు. ఇస్లామీయ షరీయతు ప్రకారం ఆరోపణకర్త సాక్ష్యాధారాలను సమర్పించలేనప్పుడు నిందితుని చేత ప్రమాణ స్వీకారం చేయించాలి. ఇప్పుడు ఈ కేసు ప్రకారం ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) చేత 'ప్రమాణం' చేయించాలి. ఈ పరిస్థితి రాకుండా వదలిపెట్టమని న్యాయమూర్తి ఆరోపణకర్తను కోరారు. "ఇది మీ పక్షపాత వైఖరికి రెండవ నిదర్శనం" అని ఖలీఫా అన్నారు.

హజ్రత్ ఉమర్ (ర) ఖలీఫాగా ఉన్న కాలంలోనే గసాఫీ శ్రీమంతుడొకడు ఇస్లాం స్వీకరించాడు. అతనిపేరు ఏహెమ్. ఇస్లాం పుచ్చుకున్న తర్వాత అతను మదీనా నగరంలో స్థిరపడ్డాడు. ముస్లింగానైతే మారాడుగాని ఇస్లాంను ఇంకా పూర్తిగా జీర్ణించుకోలేదు. కాబా గృహ తవాఫ్ (ప్రదక్షిణ) చేస్తుండగా ఒక వ్యక్తి కాలు అతని అంగ వస్త్రంపై పడింది. ఈ మాత్రం దానికి అతను రెచ్చిపోయాడు. చాచి చెంప దెబ్బ కొట్టాడు. ఈ కేసు ఖలీఫా వద్దకు వచ్చింది. తప్పు


ఏహెమ్‌ది అని తేలింది. తను కొట్టిన పల్లెటూరి వ్యక్తికి క్షమాపణ చెప్పాలని ఖలీఫా ఆదేశించారు. అందుకు ఏహెం అహం అడ్డం వచ్చింది.తనకు రెండు రోజుల గడువు ఇవ్వమని కోరాడు. ఈ రెండు రోజుల్లోపే అక్కడ్నుంచి పరారై ధర్మభ్రష్టుడైపోయాడు.ఆ శ్రీమంతుడు పలాయనం చిత్తగించినందుకు ఖలీఫా ఏ మాత్రం చింతించలేదు సరికదా నిష్పక్షపాతంగా తీర్పు ఇచ్చే సద్బుద్ధిని తనకు ప్రసాదించినందుకు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ఈనాడు అందరూ సామాజిక న్యాయం గురించీ, చట్ట సమానత్వం గురించీ అందమైన ఉపన్యాసాలిస్తారు. ప్రజాస్వామికపు విలువల గురించి అదరగొట్టేస్తూ ఉంటారు. కాని పాలకులకు - పాలితులకు, సామాన్యులకు - అధికారులకు మధ్య ఒకే రకమయిన న్యాయం క్రియాత్మకంగా అమల్లో ఉందా? చట్ట సమత్వం అనేది అందరికీ సమానంగా వర్తిస్తున్నదా? దీనికి ఎవరయినా 'అవును' అని గుండెపై చేయి పెట్టుకుని సమాధానం ఇవ్వగలరా? భారత దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా పిలువబడుతోంది. నిజానికి అలా పిలువబడే హక్కు దానికి ఉంది కూడా. అయితే దేశంలో సగటు పౌరునికీ - పాలకునికీ ఒకే రకమైన న్యాయం లభిస్తున్నదా? అంటే 'లేదనే జవాబు వస్తుంది. కాని అంతిమ దైవ ప్రవక్త (స) మనకు అందజేసిన శాసనాంగంలో ఇలాంటి హెచ్చుతగ్గులు లేవు. ఆయన (స) ప్రియ శిష్యులు తమ భావితరాల వారి కోసం వదలి వెళ్ళిన అడుగుజాడల్లోనూ, నెలకొల్పిన ఆదర్శాల్లోనూ ఈ రకమైన తారతమ్యాలు, నిమ్నోన్నతలు మచ్చుకైనా కానరావు. ఇక్కడ చట్టం దృష్టిలో అందరూ సమానులే. హజ్రత్ ఉమర్ (ర) తన పరిపాలనా కాలంలో సాక్షాత్తు గవర్నర్లనే బాహాటంగా శిక్షించారు.



# యా అల్లాహ్ !

ముహమ్మద్ ఖాన్
Gannavaram, Krishna Dist, A.P



ఓ సృష్టికర్తా , సర్వ శక్తి సంపన్నుడా
చింతిస్తున్నాను,
నేను అనుక్షణం చింతిస్తున్నాను.
నేను ఆత్మ ద్రోహిని
నేను, ముమ్మాటికీ ఆత్మ ద్రోహినే
చాలా పెద్ద తప్పు చేశాను
అన్ని నేరాలకంటే మించిన నేరం ఆత్మ ద్రోహం
అలాంటి ద్రోహానికి నే తలబడ్డాను

తెలిసో, తెలియకో
క్షమించరాని నేరమే చేశాను.
ఇప్పుడు, నన్ను నేను సరిదిద్దుకున్నాను
నా తప్పును, నేను అంగీకరిస్తున్నాను
నా నేరాన్ని నేను ఒప్పుకుంటున్నాను
నేను బేషరతుగా
నా తప్పుకు లెంపలేసుకుంటున్నాను
నేను పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాను

నేను చేసిన ద్రోహానికి
నేను చేసిన గాయానికి మనసు ఎంతగా తల్లడిల్లిందో
అనుక్షణం, ఆ బాధ నాకు హెచ్చరికగా మిగిలి
లోలోన ఎంతో ఆవేదనతో బాధిస్తూ ఉంది
నా తప్పు, నే తెలుసుకున్నా, ఆలస్యంగానే
నీవు సృష్టికర్తవు, సర్వశక్తిసంపన్నుడవు
నిస్సందేహంగా, నా తప్పును క్షమించువాడివి నీవే

నీ ప్రత్యేక
కరుణ రసాన్ని నాపై ఒలకించి
నన్ను పరిశుద్ధుడ్ని చేయగల ఏకైక శక్తివి నీవే
పాపులను కరుణించి
పాపాత్ముల శిక్షలను క్షమించి
ఇహపరలోకములో
మనశ్శాంతిని కల్గింపజేసి
నా వంటి పాపాత్ములకు రక్షణకారివి కాంతివి నీవే
అందుకే నిన్ను శరణు వేడుకుంటున్నాను

"అల్లాహుమ్మ ఇన్నీ జలమ్తు నఫ్సీ జుల్మన్ కసీరంవ్వలా యగ్‌ఫిరిజ్జునూబ ఇల్లా అన్‌త ఫగ్‌ఫిర్లీ మగ్‌ఫిరతమ్ మిన్ ఇన్‌దిక వర్హమ్‌నీ ఇన్నక అన్-తల్ గఫూరుర్రహీమ్".

# ఓ భార్యగా నేను

- ఉమ్మె హసన్

## పిల్లల పోషణ

(1) ప్రతిరోజు వారి దిన చర్య గురించి వారికి గుర్తుచేస్తాను.

(2) సంతోష ఘడియల్లోనే కాక దుఃఖ సమయంలోనూ వారికి అండగా నిలుస్తాను. అవసరమనిపిస్తే మంచి సలహాలూ ఇస్తాను.

(3) నేను వారికి అత్తరు పూస్తాను - ముఖ్యంగా జుమ్మా రోజున.

(4) నా కోరికల్ని వారితో చెప్పడానికి మంచి భాషాశైలి ఉపయోగిస్తాను. ఉదా: ఓ స్త్రీకి ఈ ప్రపంచంలో తన భర్త తప్ప మరేమి అవసరం లేదు. తన భర్త క్షేమమే ఆమెకు సర్వస్వము. ఆయనకు మించింది ఏదీ లేదు. భర్త తన వాడైపోతే ఆమెకు ప్రపంచమంతా పొందినంత ఆనందం ఉంటుంది. ఆమె తన ఆశలన్నీ ఆయనపైనే పెట్టుకుని వుంటుంది.

(5) నేను కొత్త కొత్త వంటకాలు నేర్చుకోవాలని ప్రయత్నిస్తాను. అలా వారు ప్రతి రోజు నాలో ఓ కొత్తదనాన్ని చూడాలన్నదే నా ఆశ.

(6) మేము ప్రాపంచిక విషయాల్లోగాని, ధార్మిక విషయాల్లోగాని వివాదానికి చోటివ్వము. పిల్లల పేరు విషయం, ఏదైనా పగిలితే, అన్నం కాస్త కాలితే ... ఇత్యాదివి....

(7) నేను ఆయన కోసం అప్పుడప్పుడు ఓ కొత్త రీతిలో నన్ను నేను అలంకరించుకుంటాను. జడ కూడా ఎన్నో విధాలుగా వేసుకుంటాను. వారు నన్ను చూసిన ప్రతి  క్షణం ఓ కొత్తదనం కనిపించాలన్నది నా కోరిక.

(8) వారు గ్లాసుతో నీళ్ళు త్రాగేటప్పుడు ఎక్కడైతే వారు తన పెదాలు ఆనించి సేవిస్తారో ఆ స్థలంలోనే నా పెదవులను ఆనిస్తాను.

(9) వారు కాస్త ఎక్కువగా కలత చెందితే వారిని ఓదార్చడానికి మంచి మార్గాలను అవలంబిస్తాను.

(10) నేను వారికోసం బాహ్యాలంకరణతో పాటు సువాసన పూసుకుంటాను. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎప్పుడూ వారిని అయిష్ట పరచను. చెమట దుర్వాసనతో గాని, దంతాలు శుభ్రపరచకుండా పాచి పళ్ళతోగాని ఆయన దగ్గరకు వెళ్ళను.

(11) నేను సదా నవ్వుతూ వారిని ఆహ్వానిస్తాను.

# ఓ భర్తగా నేను

- అబుల్ హసన్

(1) నేను నా సంతానానికి - అమ్మను గౌరవించమనీ, ఆమె ఎదుట దురుసుగా ప్రవర్తించకండనీ, ఆమె ప్రతి మంచి మాటకి విధేయత చూపమని చాలా నేర్పుతో శిక్షణ ఇస్తాను.

(2) నేను వారికి ఇచ్చే శిక్షణలో " అమ్మ తలను ముద్దాడండి " అన్నది ముఖ్య విషయం.

(3) పిల్లలు నాతో ఏదైనా కావాలని మారాం పెడితే మీ అమ్మ ఏం చెప్పిందని అడుగుతాను. పిల్లల విషయంలో మా ఇరువురి అభిప్రాయాలు వేరు కాకూడదన్నదే నా ఆశ.

(4) పిల్లల పరిశుభ్రతా - పరిశుద్ధత విషయంలో ఆమెకు చేయూతనిస్తాను. ఉ: ఆమె వారికి స్నానం చేయిస్తుంది. నేను వారికి గుడ్డలు తొడుగుతాను.

(5) పిల్లల పోషణ గురించి ఆమె ఏదైనా సలహా ఇస్తే నేను దాన్ని గౌరవిస్తాను. ఇలాంటి విషయాల్లో ఆమెతో ఏకీభవిస్తాను. గొడవ --పడను.

(6) నేను పిల్లలను అప్పుడప్పుడు బైటికి తీసుకెళతాను. ఆ విధంగా ఆమె కాస్త విశ్రాంతి తీసుకోవాలన్నదే నా ఉద్దేశం.

## సెలవు దినాలు


(7) పూర్తి వారం రోజులలో కుటుంబ సభ్యులకని ఓ రోజుని కేటాయిస్తాను. ఆ రోజు వారందరిని విహారయాత్రకి తీసుకెళతాను. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ స్వచ్ఛమైన శ్వాస పీల్చగలగాలని, వారి మనసు కుదుట పడాలని.

(8) ఆమె తన తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళాలని తలిస్తే సాధ్యమైనంత వరకు తోడు వెళ్ళడానికి ప్రయత్నిస్తాను.

(9) సెలవు రోజుల్లో అప్పుడప్పుడు ఇద్దరం కలిసి ఖియాముల్ లైల్ చేస్తాము. ఇద్దరం కలిసి ఖుర్ఆన్ పారాయణం చేస్తాము. లేక ఏదైనా హదీసు పుస్తకం లేక మంచి పుస్తకాలు చదువుతాము. ఈ సమయాన్ని మా మధ్య వున్న బంధాన్ని మరింత పటిష్టం చెయ్యడానికి ప్రయత్నిస్తాము. అలాగే ఈ విధంగా మేము ధర్మ పరంగానూ లాభం పొందుతాము.

(10) ముఖ్యంగా శుక్రవారం రోజు  సూరయె కహఫ్ పారాయణం చెయ్యమని ఆమెను ప్రేరేపిస్తాను.

(11) నేను దూర ప్రయాణానికి వెళ్ళవలసి ఉంటే ఆమె పట్ల నాకున్న ప్రేమానురాగాలను  వ్యక్తపరుస్తాను. నా మదిలో ఆమె  చోటు పదిలమై వుందని తెలియ చేయడానికి ప్రయత్నిస్తాను.



ముహమ్మద్ (బేరం ఈశ్వర్ రెడ్డి)



# ఆలోచించండి!



అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

సోదరీ సోదరులారా! ఆలోచించండి. మీరు ఎక్కడి నుంచి వచ్చారు, ఎక్కడికి వెళుతున్నారు. మన మార్గము ఎటు, మన గమ్యస్థానము ఎటు? మరి మనము వెళుతున్న మార్గము సరి అయినదేనా అనే విషయాలను గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించండి. మరి మనలను ఈ రూపములోనికి ఎవరు పంపించినారు? మరియు తిరిగి మనము ఏ రూపములోనికి వెళుతున్నాము? అసలు ఈ వ్యవస్థను ఎవరు నడిపిస్తున్నారు? అని ప్రతి ఒక్కరు ఒక్క నిమిషము ఆలోశించి మీ మనస్సాక్షినే ప్రశ్నించండి.

అసలు ఈ జీవితము అనేది క్షణభంగురం అనే విషయము ఇంచుమించు అందరికీ తెలుసు. మరి ఈ జీవితంలో అడుగు పెట్టగానే మొదట తల్లి, తండ్రి మరియు సోదరీ సోదరులు, ఆ తరువాత భార్యా పిల్లలు ఇంకా కొన్ని పాత్రలు మీకు అప్పగించబడతాయి. మరి ఈ పాత్రలలో ఎవరికి ఇవ్వవలసిన హక్కును వారికి ఇస్తూ ఆయా బాధ్యతలలో దైవానికి భయపడుతూ జీవితం గడిపినచో మన మార్గం కొంతవరకు సులభమగును. అలా కాకుండా దైవానికి భయపడకుండా, మనకు అప్పగించబడిన బాధ్యతలు నెరవేర్చకుండా జీవితాన్ని గడిపినచో మనం మార్గము తప్పి మనం అధోగతిని పొందడం ఖాయం. ఈ జీవితం ఒక పరీక్ష . ఈ సుదీర్ఘ పరీక్షలో మనం అన్ని వేళలా మనల్ని ఈ లోకములోనికి పంపిన మరియు తన వద్దకు రప్పించుకుంటూ ఉన్న ఆ మహా శక్తి ఆ మహా దైవమునే స్మరిస్తూ ఈ పరీక్షలో విజయము సాధించుటకు శ్రమ పడాలి.

ఇంకా మనము ఎప్పుడూ ఆలోచిస్తు ఉండాలి. ఎందుకంటే ఆలోచించే శక్తి ఒక మానవునికే దైవము ఇచ్చినాడు. మరి దేనిని గురించి ఆలోచించాలి? మన పిల్లల గురించా లేక మన బంధువుల గురించా? లేక ఎలా సంపాదించాలి అనా! కాదు మన లక్ష్యం గురించి ఆలోచించాలి. తరువాత మనం చేయాల్సిన పనులేమిటో తెలుసుకోవాలి. అలాగే దైవాన్ని గురించి ఆలోచించాలి. మరణాన్ని గురించి ఆలోచించాలి. మరణము తరువాత ఏమి అనే విషయము గురించి ఆలోచించాలి. జీవితాన్ని గురించి దైవ గ్రంథములలో ఏమి చెప్ప బడినది అని ఆలోచించాలి. మరి ఆ విధముగా మనము నడుస్తున్నామా లేదా అని ఆలోచించాలి. మనము ఒక చిన్న పని చేయదలచుకుంటే దాన్ని గురించి అనేక విధముల ఆలోచించి దానిలోని లాభ నష్టముల గురించి ఆలోచించి ఆ తరువాత ఆ పనిచేయుటకు మొదలు పెట్టుతాము. మరి అలాంటప్పుడు మన జీవితము గురించి ఎంత శ్రద్ధ తీసుకుంటున్నామో ఒక సారి ఆలోచించండి. మనం వేసేటటువంటి ప్రతి అడుగు ఆ దైవము వైపు వేయుటకు ప్రయత్నించాలి. ఇంకా మనము చేసే ప్రతి కదలికకు, ప్రతి పనికి ఆ దైవము దగ్గర సమాధానం చెప్పవలసి వస్తుంది అని తెలుసుకొని నడుచుకోవాలి. మరొక విషయము గురించి ఆలోచించండి. ఏమిటీ అంటే సృష్టిలోనికి రాక పూర్వమే మనకు కావలసిన అన్ని సదుపాయాలు ఏర్పరచి ధర్మము అనేటటువంటి మార్గము ఏర్పరచి, గ్రంథాలు అనేటువంటి కేటలాగులను ఇచ్చి, దేహము అనేటటువంటి అత్యంత విలువైన అత్యంత ఖరీదు అయిన వాహనాన్ని ఇచ్చి తన వైపుకురమ్మని చెప్పిన దైవ మార్గములో ఎంతవరకు వెళుతున్నామో ఆలోచించండి. మరి మనం అందరం దైవమార్గములో జీవితము సాగించి ఈ జన్మను సార్థకం చేసుకోవాలి అని మీ అందరినీ కోరుకుంటూ!

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

# చివరి హజ్ ప్రయాణం

## (హజ్జతుల్ విదా హి.శ : 10)

ధర్మ సందేశాన్ని ప్రజలకు చేరవేసే కార్యం పూర్తి అయిన తరువాత, మిథ్యాశక్తుల్ని ప్రక్కనెట్టి స్వచ్ఛమైన ఏకేశ్వరోపాసనా సిద్ధాంతంపై మరియు ప్రవక్త (స) గారి దైవ దౌత్యంపై నూతన సమాజ సంస్థాపన జరిగిన పిదప తన ఇహలోక గడువు పూర్తి కావస్తుందన్న అనుమానం ప్రవక్త (స) గారి మదిలో మెదిలింది. హిజ్రి శకం 10వ ఏట మహా ప్రవక్త (స) హజ్ కొరకు ప్రయాణం కానున్నారని ప్రకటించారు. మదీనా నుండి (మరియు ఇతర ప్రాంతాల నుండి) అనేక మంది బయలుదేరారు. వారిలోని ప్రతి ఒక్కరికి ప్రవక్త (స) గారితో హజ్ చేయాలన్న ఆకాంక్ష ఉంది. వారి సంఖ్య దాదాపు లక్షకు చేరుకుంది. ఈ గొప్ప జన సమూహం మక్కా వైపు ప్రయాణమయ్యింది. ప్రవక్త (స) మస్జిదె హరామ్‌లో ప్రవేశించటంతోనే 'కాబా' ప్రదక్షిణ చేశారు. సఫా మర్వా కొండల మధ్య (జోరుగా నడిచి) సయీ చేశారు. ఆ తరువాత ఎనిమిదవ తారీఖున - అదే 'యౌముత్తర్వియా' (తర్వియా రోజున) మినాకి వెళ్ళారు. ఆ తరువాత 9వ తేదీన మినా నుండి అరఫా మైదానానికి చేరుకున్నారు. అక్కడ ఆయన (స) తన చారిత్రాత్మకమైన ప్రసంగాన్ని విన్పించారు. ఈ ప్రసంగాన్నే 'వీడ్కోలు ప్రసంగం' అంటారు. ఈ ప్రసంగంలో ఆయన ఇలా ఉపదేశించారు:

"ప్రజలారా! (నేను చెప్పేదంతా) శ్రద్ధగా ఆలకించండి. వచ్చే యేడు నేనిక్కడ మిమ్మల్ని కలుసుకుంటానో లేదో తెలియదు. మీ రక్తం (ప్రాణం) మీ ధనం ఒకరింకొకరికి పవిత్రం అంటే నిషిద్ధం). ఈ రోజు, ఈ నెల, ఈ నగరం పవిత్రమైనట్టు! అజ్ఞానకాలపు ఆచారాలన్నీ నా పాదాల క్రిందున్నాయి (అంతమయి పోయాయి). అజ్ఞాన కాలపు మీ రక్త పరిహారాలన్నీ నేటితో అంతం (నిషిద్ధం) చేయబడ్డాయి. నిశ్చయంగా వడ్డీ నిషేధించ బడింది. మహిళల విషయంలో మీరు అల్లాహ్‌కు భయపడండి. వారితో మంచిగా వ్యవహరించండి. వారికి మంచిగా తిండి, బట్ట ఇవ్వండి. నేను మీ మధ్య ఒక వస్తువును వదలి వెళుతున్నాను. దాన్ని మీరు దృఢంగా పట్టుకుని అనుసరించారంటే ఎన్నటికీ మీరు దారి తప్పరు. అదే దైవగ్రంథం ఖుర్ఆన్.

"ప్రజలారా! నా తరువాత మరో ప్రవక్త రాబోడు. మీ తరువాత మరో సముదాయం (ప్రవక్త ఉమ్మత్) రాబోదు. బాగా వినండి. మీ నిజ ప్రభువునే ఆరాధించండి. ఐదు పూటల నమాజు పాటించండి. రమజాను మాసపు ఉపవాసాలు ఉండండి. మీ సంపదలోంచి జకాతు చెల్లించండి. మీ ప్రభువు గృహం వైపు హజ్ (ప్రయాణం) చేయండి. మీ నాయకుల మాట వినండి. (ఇలా గనక మీరు చేస్తే) మీరు స్వర్గంలో

ఇలా మహా ప్రవక్త (స) ప్రతి వాక్యం తరువాత కాసేపు మౌనం వహించేవారు. ప్రవక్త (స) చెప్పిన పలుకుల్ని బిగ్గరగా పునరుద్ఘాటించి ప్రజలకు వినిపించాలని, అలాగే అక్కడున్న ప్రతి వ్యక్తికి ఈ పిలుపు అందాలని ఇలా చేశారు. తన ప్రసంగాన్ని పూర్తి చేసిన పిదప చివర్లో ఆయన "(ప్రజలారా!) నేను దైవ సందేశాన్ని మీకు అందజేశానా?" అని పలికినప్పుడు 'మీరు దేవుని సందేశాన్ని అందజేశారు. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించారు, మాకు గొప్ప గొప్ప ఉపదేశాలు చేశారని మేము సాక్ష్యమిస్తాము' అని జవాబు చెప్పారు సహాబా. ఇది విని దైవ ప్రవక్త (స) "అల్లాహ్! దీనికి నీవే సాక్షివి" అని అన్నారు.

దైవ ప్రవక్త (స) ప్రసంగం ముగిశాక, ఆ సందర్భంలోనే విశ్వ ప్రభువు కారుణ్య జల్లు కురిసింది-

**"నేనీ రోజు మీ కోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవన ధర్మంగా ఆమోదించాను"** (మాయిదా:3)



"**నా** కర్మల చిట్టా స్వచ్ఛంగా, ప్రకాశ మానంగా ఉండాలి. నా రికార్డు ఎల్లరికీ ఆదర్శప్రాయంగా ఉండాలి. సత్కార్యాల విషయంలో జనులు నన్ను ఉదాహరణగా తీసుకోవాలి. నా వల్ల లోకంలో మంచి వ్యాపించాలి. నా ఉనికి అంధకారంలో కాంతి కిరణం కావాలి...."

దైవాన్ని నమ్మే ప్రతి వ్యక్తీ, తన ప్రభువుని కలుసుకుంటానని ఆశించే ప్రతి సజ్జనుని అణువణువునూ పెనవేసుకుని ఉండే 'ఆకాంక్ష' ఇది! వారు చేసే ప్రార్థనల్లో - "ప్రభూ! మమ్మల్ని సజ్జనులకు నాయకునిగా చెయ్యి" (అల్ ఫుర్ఖాన్ : 74) అనేది ఒకటి.

కాబట్టి జనులను మంచి వైపుకు నడిపించే వారు ఖుద్దుగా ఆ 'మంచికి ప్రతిరూపం' కావాలి. అతని వ్యవహార సరళి దుర్వర్తనుల కు, అవిధేయులకు ఉదాహరణ ప్రాయం కాకూడదు. ఒకవేళ అతను నాయకత్వ బాధ్యతల నుండి తప్పుకున్నా, ఆఖరికి అతను ఈ లోకం నుంచి తనువు చాలించినా అనుయాయులు అతన్ని జ్ఞాపకముంచుకోగలగాలి. వారి దిన చర్యల్లో అతని క్రమశిక్షణ, ఆదర్శాలు తొణికిసలాడుతూ ఉండాలి.

ఒక విశ్వాసిలోని ఈ మనోరథం ఈడేరాలంటే, అతని జీవితం మంచికి

హజ్రత్ హర్మల (రజి) అనే ప్రవక్త ప్రియ సహచరులు ఒకసారి,

'అయ్యా దైవ ప్రవక్తా (సఅసం)! నేను ఆచరించవలసిన కర్మలేవో సెల వీయండి' అని విన్నవించుకున్నప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "మంచి పనులు చెయ్యి. దుష్కర్మలకు దూరంగా ఉండు. నీ వెనుక జనులు నిన్ను మంచివాడుగా చెప్పుకోవాలన్నది నీ ఆకాంక్ష అయితే ఆ మంచి లక్షణాలను నీవు పుణికి పుచ్చుకో. ఏ ఏ చెడ్డ పేర్లతో జనులు నిన్ను స్మరించకూడదనుకుంటావో వాటిని పరిత్యజించు"...

# మన జీవిత పయనమెటు?

మరి ఈ ప్రబల కోర్కెతో జీవించే వ్యక్తి చేయాల్సిందేమిటి? ముఖ్యంగా జీవన రథానికి సారథ్యం వహించాలని ఉవ్విళ్ళూరే వారు తమ వెనుక నడిచే వారికి ఆదర్శ ప్రాయులు కావాలి. ఉదాహరణకు;- సామూహిక నమాజు కోసం జనులు ఏ వ్యక్తిని నాయకుని (ఇమామ్) గా చేసుకుంటారో అతన్ని నమాజులో ఉన్నంత సేపూ ఖచ్చితంగా అనుసరిస్తారు. నమాజు ముగిసే వరకు ఆ వ్యక్తి చేసేదల్లా చేస్తారు. అతను నిలబడినప్పుడు వారూ నిలబడతారు. అతను వంగినప్పుడు వాళ్ళూ వంగుతారు. అతను సాష్టాంగ పడినప్పుడు వారు కూడా సాష్టాంగ ప్రణామం చేస్తారు. ఏ ఒక్క కదలికలోనూ వారు తమ నాయకునికి విరుద్ధంగా చేయరు...



మారు పేరుగా ఉండాలి. అతని నిత్య జీవితంలోని ఒక్కొక్క విభాగంలో దాని ప్రభావం ద్యోతకమవుతూ ఉండాలి. కాని.....

వ్యవహారం గనక తద్భిన్నంగా ఉంటే...అతని జీవిత పయనం అతని ప్రార్థనకు విరుద్ధంగా ఉంటే....అతని దైనందిన కార్యకలాపాలు అతని సదాశయానికి వ్యాఘాతంగా పరిణ మిస్తుంటే.. అతని 'దుఆ' కేవలం మాటలకే పరిమితమై ఉండి, అతని చేతలు మంచికి వ్యతిరేకంగా ఉంటే... అట్టి పరిస్థితిలో అతను తన ఉనికి ద్వారా అందరినీ మభ్య పెడుతున్నాడు. అతని 'ఆకాంక్ష' స్వయంగా అతన్ని అవహేళన చేస్తుంది.

ప్రతి విశ్వాసీ కోరుకునేది ఏమిటి?

లోకం తనను మంచివాడుగా గుర్తుంచు కోవాలి... తన జీవితం వల్ల ఇతరులకు మేలు చేకూరాలి... తన అస్తిత్వం వల్ల లోకంలో మంచి వ్యాపించాలి...

ఇది 'మంచి కలే'. కాని మనం ఆ దిశలో సాధన చేయకపోతే అది 'పగటి కల' గానే మిగిలిపోతుంది. మన అహోరాత్రులు 'మంచి' కోసమే గడవాలి. మన సమావేశాల్లో, సంభాషణలో, చర్చల్లో 'మంచి'కి పెద్ద పీట వేయాలి. మన నిత్య కార్యకలాపాల్లో విశ్వాసం (ఈమాన్) కోరే ప్రత్యేక సుగుణం ఉట్టిపడాలి. మన ఆలోచనల్లో, అభిప్రాయాల్లో ఇస్లామీయ శైలి తొణికిసలాడాలి. మన నివాస గృహాలు ఫుల్‌టైం ధార్మిక పాఠశాలల్లా వెలుగొందాలి. మనం చేసే వర్తకమైనా, ఉద్యోగమైనా, వ్యవసాయమైనా షరీయతు ఆదేశాలకు నిబద్ధమై ఉండాలి. దురదృష్టవశాత్తూ మన ప్రవర్తన గనక దీనికి విరుద్ధంగా ఉంటే - ఇతరులు మన నుండి మంచిని కాదు - చెడును, దుర్మార్గాన్ని, దౌష్ట్యాన్ని నేర్చుకుంటారు !

# దైవ కానుక ఇస్లామ్



(పూర్వాశ్రమంలో చంద్ర శేఖర్‌గా పిలువబడే ఉస్మాన్ పెద్ద విద్యావంతుడు కాకపోవచ్చు. కాని 'చిత్తశుద్ధి' తో ధర్మాన్ని అవలంబించే ధన్యజీవి. ఆరేళ్ళ క్రితం కువైట్ పొలిమేరల్లోని బర్ (ఎడారి)లో సాక్ష్యవచనం పలికిన ఈ అబ్బాయి కుటుంబ సమేతంగా ఇస్లాం సత్యామృతాన్ని ఆస్వాదిస్తున్నాడు. కడప జిల్లా గాలివీడు వాస్తవ్యుడైన ఈ సత్య ప్రేమికుని 'ధర్మావగాహన' కు అద్దం పడుతుంది ఈ వ్యాసం. కారుణ్య ప్రభువు అయిన అల్లాహ్ ఈ అబ్బాయికి సన్మార్గంలో సహన స్థైర్యాలను ప్రసాదించాలని వేడుకుందాం - ఎడిటర్)

సోదరులారా! ప్రపంచంలో అన్నిటికన్నా 'ఇస్లామే' గొప్ప దైవ కానుక అని మనస్ఫూర్తిగా విశ్వసిస్తాడు ప్రతి ముస్లిం. ప్రవక్త ముహమ్మద్(స) స్థాపించిన ఉమ్మత్ (అనుచర సంఘం) లో తన్ను చేర్చి ఇస్లామ్‌ను అనుగ్రహించినందుకు దేవునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకుంటూ ఉంటాడు కూడా. ఇదే తాను అనుగ్రహించిన కానుక అని అల్లాహ్ స్వయంగానూ సూచించి ఉన్నాడు. దివ్యఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ఆదేశించబడింది.

**"నేడు మీ కొరకు మీ దీన్‌ని (జీవన సన్మార్గాన్ని) పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇస్లామ్‌నే మీ జీవన మార్గంగా సమ్మతించాను."**

**(5:3)**

అలాగైతే ఆ జీవన మార్గం పొందేది ఎలా? ముస్లిం అయ్యేది ఎలా? మనము ఆయనకు కృతజ్ఞతాభివందనాలు ఏ విధంగా చెల్లించాలి? అంటే దైవం మనల్ని ప్రవక్త(స) అనుచర సంఘంలో చేర్చినందుకు ప్రవక్త ముహమ్మద్(స) ను సంపూర్ణంగా అనుసరించడమే ఈ ఉపకారానికి సరి అయిన కృతజ్ఞత. మన ఆరాధనకు అర్హుడైన వాడు ఒక్కడే. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేనే లేడు. ఆయనే మొదలు, ఆయనే అంతం. ఆయన తన దాసులపై కరుణించి రుజుమార్గం వైపు మరలడానికి ఆయా జాతులలో ఆయా ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ఆయనే ఆఖరు ప్రవక్త ముహమ్మద్(స) ను ప్రభవింపజేశాడు. మహా ప్రవక్త సమస్త మానవాళిని రుజు మార్గం వైపునకు పిలిచారు. ఇహలోకం - పరలోకం గురించి బోధించిరి. ప్రవక్త (స) బోధించిన బోధనలను తెలుసుకోవాలి. వాటిని అర్థం చేసుకోవాలి. మనస్ఫూర్తిగా వాటిని స్వీకరించాలి. వాటి ప్రకారం ఆచరించడానికి ప్రయత్నించాలి. ఇలా చేసిన వ్యక్తియే రుజుమార్గం పొందగలడు. ఇతనే ముస్లిం అనబడతాడు. ఒక వ్యక్తి బ్రాహ్మణుని ఇంట జన్మిస్తే బ్రాహ్మణుడు అవుతాడు. శూద్రుని ఇంట జన్మిస్తే శూద్రుడవుతాడు. అలాగే ముస్లిం అవ్వాలంటే ముస్లింల ఇంట జన్మించాలా? ప్రథమంగా దైవ జ్ఞానం, జ్ఞానానంతరం ఆచరణ పేరే ఇస్లాం. ఒక వ్యక్తి జ్ఞానం లేకుండా ముస్లిం అవజాలడు. జ్ఞానం ద్వారానే కాగలడు. ప్రవక్త ముహమ్మద్ (స) బోధించిన బోధనలేమిటో 'జ్ఞానం' లేకుంటే వాటిని ఎలా విశ్వసిస్తాడు? అందుకు తను జ్ఞానం ద్వారా తన ప్రభువుని తెలుసుకుని తన ప్రవక్త (స) బోధించిన బోధనలను తెలుసుకుని వాటి ప్రకారం ఆచరించే ఏ జాతి వాడైనా అతను ఇస్లాంలో చేరిపోతాడు. తను ప్రభువుని గుర్తించినాక, ఆయన ఆజ్ఞలేవో, ఆయన సమ్మతి పొందే ఆచరణ విధానమేదో, ఆయన ప్రసన్నుడయ్యే కార్యాలేవో, ఆయన ఆగ్రహించే పనులేవో పూర్తిగా తెలుసుకోవాలి. ఈ విషయాలు తెలుసుకున్న తదుపరి మనిషి తానై తన యజమానికి బానిసైపోవాలి. యజమాని సమ్మతేదో దానిపై నడుచుకోవాలి. తన ఇచ్ఛను వదిలి పెట్టాలి. తన మనస్సు ఒక విషయాన్ని కోరినప్పుడు ప్రభువాజ్ఞ దానికి విరుద్ధంగా ఉంటే తన మనో వాంఛను వినకుండా ప్రభువాజ్ఞను పాటించాలి. ఒక పని తనకు మంచిదని తోచినా అది చెడ్డ

పని అని యజమాని అంటే దాన్ని చెడ్డదిగానే భావించాలి. మరో కార్యం తనకు చెడ్డది గోచరించినా యజమాని అది మంచిది అంటే దాన్ని మంచిదిగానే నమ్మాలి. ఒక కార్యంలో అతనికి నష్టం గోచరించినా ప్రభువాజ్ఞ దాన్ని చేయమంటే అందులో ధన ప్రాణ నష్టం ఎంత కలిగినా దాన్ని చేసి తీరాలి. మరొక పనిలో తనకు లాభం కనిపించినా దాన్ని చేయవద్దని యజమాని శాసించినప్పుడు సకల సౌభాగ్యాలు ఉన్నా ఆ కార్యం సుతరామూ చేయకూడదు. ఇలా జ్ఞానంతో పాటు ఈ 'ఆచరణ' వల్లనే ఒక ముస్లిం అల్లాహ్‌కు ప్రియతముడవుతాడు. వీటికి విరుద్ధంగా చేసే వ్యక్తి ముస్లింల ఇంట పుట్టి ముస్లిం అని చెప్పుకున్నంతమాత్రాన ముస్లిం కాలేదు. దైవ తిరస్కారుల - ముస్లింల నిజమైన వ్యత్యాసం పేరులో లేదు. తిరస్కారులు -ముస్లిములలో తేడా వస్త్రధారణ కూడా కాదు. వాస్తవానికి ఆ ఉభయుల మధ్య నిజమైన భేద కారణం 'జ్ఞానం' ఒక్కటే. అతను తిరస్కారి అనడానికి గల కారణం సర్వేశ్వరునికి తనకు ఎలాంటి సంబంధం ఉందో, సృష్టికర్త ఇచ్చాను సారంగా ప్రపంచంలో జీవితం గడిపే సరళమైన మార్గమేదో అతనికి తెలియక పోవడం మూలానే. లేదా తెలిసీ వాటి ప్రకారం ఆచరించడానికి వెనుకాడే వ్యక్తే తిరస్కారి అవుతాడు. నిజానికి ఇద్దరూ దేవుని దాసులే. కాని ఒక వ్యక్తి తన ప్రభువుని గుర్తించిన కారణాన శ్రేష్ఠుడవుతాడు. ముస్లిం అవుతాడు. అతను దైవాజ్ఞల్ని పాటిస్తాడు. రెండవ వ్యక్తి తన ప్రభువుని గుర్తించక పోవడం మూలానా తిరస్కారి అవుతాడు. ముస్లింలను తిరస్కారులను వేరు పర్చే విషయాలు రెండే. 1) దైవ జ్ఞానం 2) సదాచరణ. తన ప్రభువు చూపెట్టిన సరళ మార్గాన్ని ఎరిగి, ఆయన ఆజ్ఞా పాలన చేసేవారు మాత్రమే ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ఆయన అనుగ్రహానికి పాత్రులవుతారు. కాని ఎవరిలోనైతే ఈ గుణ విశేషాలుండవో వారి పేరు అబ్దుల్లాహ్, అబ్దుర్రహ్మాన్ అయినా లేక రాజా రెడ్డి, రాంప్రసాద్ అయినా దేవుడి వద్ద వీరిద్దరిలో ఎలాంటి భేదభావం లేదు. వీరికి దేవుని అనుగ్రహంలో ఎలాంటి హక్కు ఉండదు.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) ఒక విగ్రహారాధకుని ఇంట జన్మించారు. కానీ ఆయన తన ప్రభువుని గుర్తించారు. ప్రభువు ఆజ్ఞాపాలన చేశారు. అందుకే ఆయన్ని దేవుడు యావత్ ప్రపంచానికి నాయకునిగా చేశాడు. హజ్రత్ నూహ్ (అలై) కుమారుడు ఒక ప్రవక్త ఇంట పుట్టాడు. కానీ దేవుడ్ని గుర్తించలేదు. దైవాజ్ఞల్ని ధిక్కరించాడు. అందుకే అతని వంశాన్ని అల్లాహ్ ఏ మాత్రమూ లెక్క జేయలేదు. అతన్ని దైవం శిక్షించిన తీరు నేటికీ లోకానికి ఒక గుణపాఠంగా మిగిలి ఉంది.


సోదరులారా! ఈ విషయాల ద్వారా వ్యక్తమయ్యే దేమిటో గమనించండి: మీకు ప్రాప్తమయిన ఈ మహత్తర దైవ కానుక (ఇస్లాం) తల్లిదండ్రుల ద్వారానో లేక దానంతట అదే లభించేది కాదు. దీన్ని పొందటం పూర్తిగా మీ స్వయంకృషి పైనే ఆధారపడి ఉంది. ఒక వ్యక్తి ముస్లిం అని చాటుకున్నా అతను పరిధుల వెలుపల అడుగు పెడితే అతను ఇస్లాం నుండి దూరం అవుతాడు. ఒక వ్యక్తి ముస్లిం అని చెప్పుకున్నప్పుడు అతను ముస్లిం అయివుండగలిగే విషయాలేవో బాగా అర్థం చేసుకోవాలి. దైవ గ్రంథము, దైవప్రవక్త (స) సంప్రదాయాల్ని, సత్యం సదాచారాల ప్రమాణాలను, ఆదర్శాలను స్వీకరించాలి. వాటి ప్రకారం ఆచరించాలి. వాటికి భిన్నమయిన ప్రతీ దాన్ని 'మిథ్య' అని భావించాలి. ఇదే ఇస్లాం సరిహద్దు. ఈ సరిహద్దులో ఉన్న వ్యక్తే 'ముస్లిం'. దీని వెలుపల అడుగు పెడితే అతను ఇస్లాం నుంచి దూరం అవుతాడు. ఆ తర్వాత కూడా అతను ముస్లిం అని చెప్పుకున్నా అది కేవలం ఆత్మ వంచన, లోక వంచన కూడా. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: "ఎవరైతే అల్లాహ్ పంపిన ఆదేశాల ప్రకారం తీర్పు చేయరో వారే నిశ్చయంగా దైవ ధిక్కారులు (తిరస్కారులు)". (5:44)



హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్



# మస్జిద్ గురించి...



## మస్జిద్ అంటే ఏమిటి?

మస్జిద్ అంటే సజ్దా చేసే చోటు అని అర్థం. ప్రత్యేకంగా అల్లాహ్ ఆరాధన కోసం నిర్మించబడిన ఆలయాన్ని మస్జిద్ అంటారు. నమాజు చేయాలనుకునే వారందరూ అక్కడికి వెళ్ళి సామూహికంగా నమాజు చేస్తారు.

మస్జిద్‌ను కేవలం ఆరాధనాలయంగానే భావించకూడదు. వాస్తవానికి ఈ మస్జిద్‌లు ఇస్లామీయ కోటలు. ఇస్లాం ధర్మ కేంద్రాలు. ఇక్కణ్ణుంచే ఇస్లాం వెలుగు ప్రపంచంలోని నలుదిశలకు వ్యాపించి విశ్వాన్నంతటినీ జ్యోతిర్మయం చేస్తుంది. ఈ మస్జిద్‌ల నుంచే సరైన ఇస్లామీయ బోధనలు జనబాహుళ్యంలో ప్రచారం చెందుతాయి. స్వచ్ఛమైన ఏక దైవోపాసనకు ప్రాచుర్యం లభిస్తుంది. మస్జిదుల్లో ముస్లింలందరూ తమతమ భేదాలన్నీ కట్టిపెట్టి పాలూనీళ్ళల్లా కలిసిపోతారు. అల్పుడూ, అధికుడు, పేదవాడు, ధనికుడు, అరబ్బుడు అరబ్బేతరుడు, నల్లవాడు తెల్లవాడన్న భేదభావాలన్నీ మరచి ఒకే వరుసలో నిలుచుంటారు.

## మస్జిదుల ఘనత

మస్జిదులతో సంబంధం పెట్టుకోవటం, సంప్రతింపులు జరపటం విశ్వాసుల లక్షణమని చెప్పబడింది. అల్లాహ్ ఇలా అన్నాడు: **"అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించి, నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్‌కు తప్ప మరెవరికీ భయపడనివారు మాత్రమే అల్లాహ్ యొక్క మస్జిదులకు సంరక్షకులూ, సేవకులూ కాగలుగుతారు".**

(ఖుర్ఆన్-9: 18)

దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "మీరు ఒక వ్యక్తిని మస్జిద్‌కు వస్తూ పోతూ ఉండగా చూసినట్లయితే, అతని విశ్వాసం (ఈమాన్) గురించి మీరు సాక్ష్యమివ్వండి".

(అహ్మద్ - తిర్మిజి)

మరో సందర్భంగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుని దృష్టిలో అన్ని చోట్లలోకెల్లా అత్యంత శ్రేయస్కరమైన చోటు మస్జిదు. అన్ని చోట్లలోకెల్లా అత్యంత హాని (ప్రమాద) కరమైన చోటు బజారు. (బుఖారీ)

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఉదయం పూటగాని, సాయంత్రం వేళగాని ఎవరయినా మస్జిద్‌కు వెళితే దేవుడు అతని ఆతిథ్యం కోసం స్వర్గంలో బసను ఏర్పాటు చేస్తాడు. అతను ఉదయం పూట, సాయంత్రం వేళ ఎప్పుడు వెళ్ళినా సరే!

(బుఖారీ - ముస్లిం)

ఆయన ఇంకో సందర్భంగా ఇలా అన్నారు: "ఎవరయినా అల్లాహ్ కోసం మస్జిద్‌ను నిర్మిస్తే, అల్లాహ్ అతని కోసం స్వర్గంలో ఒక ఇల్లు నిర్మిస్తాడు" (బుఖారీ - ముస్లిం)

ఆయన ఇంకా ఇలా అన్నారు: నా ఈ మస్జిద్ (అనగా మస్జిదె నబవీ)లో చేసే ఒక నమాజు ఇతర మస్జిదుల్లో చేసే వెయ్యి నమాజుల కంటే శ్రేష్ఠమైనది. ఇంకా మస్జిదే హరామ్‌లో చేసిన ఒక నమాజు ఇతర మస్జిదుల్లో చేసే లక్ష నమాజుల కంటే శ్రేష్ఠమైనది. (అహ్మద్ - ఇబ్నె మాజా)

ఆయన ఇలా కూడా అన్నారు: ఎవరయినా తన ఇంటి దగ్గర వుజూ చేసుకుని, ఆ తర్వాత దేవుని గృహాలలో ఏదైనా ఒక గృహంలో దేవుని ఫర్జ్ (నమాజు) లలో ఏదైనా ఒక ఫర్జ్‌ను నిర్వర్తించటానికి బయలుదేరితే, అతని ప్రతి అడుగు ఒక పాపాన్ని తుడిచివేస్తుంది. మరో వైపు ఒక అంతస్తుని పెంచుతుంది. (ముస్లిం)

అంటే అతను వేసే ప్రతి అడుగుకు బదులుగా అతని కర్మల పత్రంలో ఒక పుణ్యం లిఖించబడుతుంది. అతని పరలోకపు అంతస్తులు పెరుగుతాయి. పాపాలు మన్నించబడతాయి. ■




- జాఫర్ బిన్ అబీతాలిబ్ (ర) గారి ఉపన్యాసం విని రాజు ప్రభావితుడయ్యాడా?

**జ:** అవును జాఫర్ (ర) ఉపన్యాసం నజాషీ రాజుని కదిలించి వేసింది. వెంటనే మీకు గ్రంథమేదైనా ఉంటే అందులోని కొన్ని వాక్యాలను చదివి వినిపిస్తారా? అని కోరాడు.

- జాఫర్ (ర) ఖుర్ఆన్ వాక్యాలు వినిపించారా?

**జ:** అవును. సూరయె మర్యం నుండి కొన్ని వాక్యాలను పఠించారు. వాటిలో ఈసా (అ) జననం గురించి కూడా వుంది.

- ఖుర్ఆన్ వాక్యాలు విన్న తరువాత రాజు ఏమన్నాడు?

**జ:** ఖుర్ఆన్ వాక్యాలను విన్న రాజు " ఈ గ్రంథం మరియు ఈసా (అ) తెచ్చిన గ్రంథం ఒకే దీపపు వెలుగులు " అని అన్నాడు.

- ముస్లిములను వెంటాడి వచ్చిన ఖురైషులతో రాజు ఏమన్నాడు?

**జ:** ఓ ఖురైషులారా! ఈ ముస్లింలు నిర్దోషులని మేము భావిస్తున్నాము. వీరిని మీకు అప్పగించేది లేదు. వీరికి వ్యతిరేకంగా ఏ ఎత్తుగడా ఇక్కడ పనికిరాదు. ఇక మీరు వెళ్ళవచ్చు " అని తెలియజేసి సభను ముగించాడు.

- వారిద్దరూ మరునటి రోజు రాజుతో ఏమన్నారు?

**జ:** ఓ రాజా! మీరు ఈసా (అ) ఏసుగారిపై ఓ తీవ్రమైన నిందను వేస్తున్నారు అని చెప్పారు.

- వారి ఈ మాటలు విని రాజు ఏమి చేశాడు?

**జ:** " ఏసుక్రీస్తుపై మీ అభిప్రాయమేమిటి? " అని రాజు వారిని ప్రశ్నించాడు.

- జాఫర్ (ర) ఈసా (అ) ఏసు గురించి ఏమన్నారు?

**జ:** జాఫర్ (ర) సమాధానమిస్తూ " రాజా! మేము ఈసా (అ) గురించి మా ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిందే చెబుతున్నాం. అంటే ఈసా (అ) అల్లాహ్ ప్రవక్త అని, ఆయన ఆత్మ అని, కన్య అయిన పవిత్ర మర్యం (అ) గర్భాన జన్మించారు " అని చెప్పారు.

- అది విన్న నజాషీ రాజు ఏమన్నాడు?

**జ:** అది విన్న నజాషీ తటాలున లేచి నిలబడి, నేలపైనుండి ఒక గడ్డి పోచను పైకెత్తి చూపిస్తూ 'దైవసాక్షి! మీరు చెప్పింది యదార్థం. ఈసా (అ) గురించి మీరు చెప్పిన దానిలో ఈ గడ్డి పోచకంటే ఎక్కువ వ్యత్యాసం లేదు' అని చెప్పాడు.

- ఆ తరువాత రాజు ముస్లిములతో ఏమన్నాడు?

**జ:** నజాషీ రాజు ముస్లిములను ఉద్దేశించి 'వెళ్ళండి, నా రాజ్యంలో ప్రశాంతంగా బ్రతకండి' అని అన్నాడు.

- నజాషీ రాజు ఖురైషులతో ఏమన్నాడు?

**జ:** వారు తెచ్చిన కానుకలను వారి ముఖాన పడవేసి వారిని వెళ్ళి పోవలసిందిగా ఆజ్ఞాపించాడు.

- ముస్లింల జీవితం అబిసీనియాలో ఎలా సాగింది?

**జ:** ప్రశాంతంగా సాగింది. ఖైబర్ విజయం సందర్భంగా వారు మదీనాకు తరలి వెళ్ళారు.

# ఇంతకీ ఆ ఒక్క దేవుడు ఎవరు?



**- ఉమ్మె ఫాతిమహ్**

ఆ ఒక్కడు ఎవరని తెలుసుకోవాలంటే ఆ ఒక్క దేవుని లక్షణములను తెలుసుకోవడం ఎంతైనా అవసరం.
సర్వ సృష్టికర్త ఆ ఒక్క దేవుడన్నప్పుడు ఆయన శక్తి కూడా అపారంగానే ఉండాలి కదా! కొన్ని లక్షణాలను మనం విచక్షణా జ్ఞానంతో పరిశీలిద్దాం.

**1) ఆ సర్వ శక్తిమంతుడు** మనందరి అలనా పాలనకు బాధ్యుడు గనక ఆ దేవుడికి నిద్ర రాకూడదు. కునుకూ పట్టకూడదు.
వస్తే అంత సేపు మమ్మల్నందర్నీ ఎవరు కనిపెట్టి ఉంటారు? మన గతేంగాను? ఎందుకంటే ఒక్క క్షణపు నిద్ర కూడా ఈ లోకంలో ఎన్నో కోట్ల పనులు చూడలేదు. మరి వాటన్నిటి తప్పొప్పులు మరుగున పడిపోతాయి. మరి న్యాయం జరగాల్సిన వాళ్ళకు న్యాయం చేకూరదు.

"దేవుడు గొప్ప న్యాయాధిపతి" అన్నది దేవుని ఇంకొక లక్షణమని మనందరికి తెలుసు. దేవుడు తప్పకుండా అందరికి న్యాయం చేస్తాడు గనక, పై మాట అంటే "కునుకు తీయటం" అన్నది దేవుని లక్షణం కాదు అని తేలిపోతుంది.

**2) "అతడు సదా జీవించే ఉండాలి"**
మరణిస్తే లోకం ఎలా నడుస్తుంది? ఎందుకంటే పై లక్షణం ప్రకారం, కునుకుకే అర్థం లేనప్పుడు మరణించడం అంతకంటే తగని పని.

**3) "ఏది తలిస్తే అది చేయగల సమర్థుడై ఉండాలి"**
లేకపోతే ఈ భూమ్యాకాశాలు, గ్రహాలు, మొదలగు ఎన్నో వింతలు ఎలా జరుగుతాయి?
ఎందుకంటే ఈ లోకంలో ఏ ఒక్కరూ, ప్రవక్తలతో సహా నేను భూమ్యాకాశాలను సృష్టించాను, మరియు సముద్రాలను తయారు చేశాను, కొండలను నిర్మించాను అని చెప్పలేరు - ఆ ఒక్క దేవుడు తప్ప. ఇంతటి పెద్ద గ్రహాలను క్రమంగా ఒక దిశలో అనుక్షణం కదిలించడం ఆ ఒక్క దేవుడికే చెల్లు.
కాబట్టి ఆ ఒక్క దేవుడ్నే మనమందరం ప్రార్థించాలి. ఇక మనం పూజించేవాళ్ళు నిజమైన దేవుడా? కాదా? అన్నది. ఇంకనూ ఎన్నో లక్షణాలున్నప్పటికీ ఈ కొన్ని లక్షణాలను పోలిస్తేనే నిజం బయటపడుతుంది. కాబట్టి మనం చేసే తప్పు (ఒక వేళ ఉంటే) ఆ నిజమైన దేవుని క్షమాపణ కోరుదాం. ఎందుకంటే మరణించిన పిదప మన మందరం మన కర్మలకు ఫలితాన్ననుభవించడానికి ఆయన వైపునకే మరలాల్సుంది. కాబట్టి మన కర్తవ్యం ఏమిటి????

– సిఫాత్ ఆలం మదని

# శీల సంపదే ముఖ్యమని మరువబోకుమా

సోదర సోదరీమణులారా!

నేడు ఎటు చూసినా అశ్లీలత, నీతి బాహ్యత, విశృంఖలత్వం పెచ్చరిల్లినట్లు కానవస్తుంది. స్త్రీ పురుషులు కలిసి విచ్చలవిడిగా విహరిస్తున్నారు. ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఒక నిజమైన విశ్వాసి, ముఖ్యంగా తన ఇల్లూ వాకిలినీ, కుటుంబీకులను వదలి దూరదేశంలో జీవన పోరాటం సాగిస్తున్న యువతీయువకులు తమ శీలాన్ని, మాన మర్యాదలను రక్షించుకోవటానికి సదా అప్రమత్తులై ఉండాలి –

అందుకే ఈ సందర్భంగా దైవ ప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) గారి సౌశీల్యాన్ని గురించి చెప్పదలిచాము.

దైవ ప్రవక్త యూసుఫ్ (అ) ప్రవక్తల వంశంలో పుట్టారు. తండ్రి యాకూబ్ (అ) ఆ అబ్బాయిని ఎంతో ప్రేమతో పెంచేవారు. దీన్ని ఇతర సోదరులు ఓర్చుకోలేకపోయారు. విహార యాత్ర పేరుతో యూసుఫ్ (అ) ను అడవికి తీసుకెళ్ళి బావిలో పడవేశారు. దారిన పోయే ఒక వర్తక బిడారు ఆ పసి వాణ్ణి ఈజిప్టు దేశానికి తీసుకెళ్ళి ఒక బానిసగా అమ్మివేసింది. ఆ అబ్బాయిని ఈజిప్టు అధికారి (అజీజ్) కొనుగోలు చేశాడు.


యూసుఫ్ (అ) అందాన్ని, గుణగణాలను చూసి అజీజ్, అతని భార్య జులైఖా మురిసిపోయేవారు. ఆ దంపతులకు సంతానం లేదు. అందుచేత వీలైతే ఈ అబ్బాయినే దత్తపుత్రునిగా చేసుకుందామన్న ఆలోచన కూడా వారికుండేది.

యూసుఫ్ వయసు పెరిగేకొద్దీ ఆయన అందం కూడా పెరిగింది. మరోవైపు అజీజు భార్య జులైఖా ఉద్దేశం కూడా మారిపోయింది. ఆ బానిస అబ్బాయిపై జులైఖా మనసు పారేసుకుంది. ఎలాగైనా అతన్ని పొందాలనుకుంది. అదను చూసి వల పన్నింది. ఇంట్లో భర్తగానీ, సేవకులుగానీ లేని సమయం చూసి, ఆ దొరసాని బాగా ముస్తాబై రాజ భవనం తలుపులు మూసేసింది. " రా... రమ్మం " టూ యూసుఫ్(అ) ని సమీపించింది.

ఆలోచించండి! యూసుఫ్ (అ) యుక్త వయస్కుడు. ఆ ఇంట్లో ఒక నౌకరు. పరువం ఉరకలు వేస్తోంది. కళ్ళు చెదిరే అందాలతో, వయ్యారాలతో యజమానురాలు మరో వైపు తనను మోహిస్తోంది, కవ్విస్తోంది. తన కోరిక తీర్చకపోతే వ్యవహారం దారుణంగా ఉండగలదని హెచ్చరిస్తోంది.... ఒకవైపు కామంతో కళ్ళు మూసుకుపోయిన దొరసాని! మరోవైపు తండ్రి నేర్పిన సంస్కారం! దైవభక్తి! – వీటి మధ్య తీవ్రమైన సంఘర్షణ.

ఎట్టకేలకు ఆయనలోని ' సౌశీల్య మూర్తి ' దే పైచేయి అయింది. ఆయన ఇలా అన్నారు;– " నన్ను మంచి స్థితిలో ఉంచిన స్వామికి నేను ద్రోహం తలపెట్టను. నేను అల్లాహ్ శరణు కోర్తున్నాను". కాని బరితెగించిన ఆ ఆడది ఇక ఏమీ వినే స్థితిలో లేదు. యూసుఫ్ (అ)ని వెంటాడింది. యూసుఫ్ బయటికి పరుగులు తీశారు. సరిగ్గా అదే సమయంలో ఆమె భర్త అజీజ్ ఎదురు పడ్డాడు. క్షణాల్లో జులైఖా ప్లేటు ఫిరాయించింది. "నీ అర్ధాంగిపై దురుద్దేశంతో కన్నేసిన వాడ్ని చెరసాలపాలు చేయటమో, లేక మరేదైనా కఠిన శిక్ష విధించటమో తప్ప వేరే శిక్ష ఏముంటుంది?" అంటూ శిక్ష కూడా ప్రతిపాదించింది. కాని అజీజుకు అసలు సంగతి బోధపడింది. సంస్కారం లేని ఈ ఆడవాళ్ళు పురికొల్పే పాడుపనులు చేయటం కన్నా చెరసాల జీవితమే మిన్న అని యూసుఫ్ (అ) కూడా కోరుకున్నారు. ఆ విధంగా చేయని నేరానికి జైలుకు వెళ్ళారు. కాని ' శీలం ' విషయంలో రాజీ పడలేదు.

నిజం నిప్పులాంటిది. రాజు గారికి యూసుఫ్ (అ) లాంటి మేధావి అవసరం ఏర్పడింది. యూసుఫ్ సేవలు రాజ్యానికి అవసరమని భావించగానే ఆయన్ని జైలు నుంచి విడుదల చేస్తున్నట్లు ప్రకటించాడు రాజు. కాని యూసుఫ్ అందుకు ఒప్పుకోలేదు. తనపై వల విసిరిన అంత:పుర మహిళల కేసును తేల్చమని ఆయన పట్టుపట్టారు. జులైఖా తన తప్పును ఒప్పుకుంది. యూసుఫ్ (అ) నిర్దోషి అని సాక్ష్యమిచ్చింది. రాజుగారు యూసుఫ్‌ను చేరదీశాడు.



కీలకమైన రాజ్యాధికారాలను యూసుఫ్‌కు కట్టబెట్టాడు. ఒక బానిసగా అమ్ముడుపోయిన దేశంలోనే యూసుఫ్ (అ) అత్యున్నత అధికారిగా వెలుగొందారు. నిస్వార్థమైన తన ప్రతిభతో ఈజిప్టు రాజ్యాన్ని ఆర్థిక సంక్షోభం నుండి కాపాడారు. సౌశీల్యానికి, పారిశుద్ధ్యానికి, శ్రేయోభిలాషా భావానికి దేవుడు ఇచ్చే 'ప్రతిఫలం' ఎంత గొప్పగా ఉంటుందో చెప్పకనే చెప్పారు.

"అవును. భయభక్తులతో, సహన స్థైర్యాలతో మెలిగే సజ్జనుల పుణ్యఫలాన్ని అల్లాహ్ వృథా చేయడు". (యూసుఫ్–90)

జీవనోపాధి కోసం కువైట్‌లో కాలు మోపిన సోదర సోదరీమణులారా! మీ జీవితం మచ్చలేనిదిగా ఉండాలి. మీ శీలానికి కళంకం అంటకూడదు. మీ శీలాన్ని కాపాడుకోవలసింది ఎవరో కాదు, స్వయంగా మీరే. మూడువేల కిలోమీటర్ల దూరంగా ఉంటూ మీ కుటుంబీకుల నుంచి మీరు 'దేన్ని' ఆశిస్తున్నారో 'దాన్నే' మీ కుటుంబీకులు కూడా మీ నుండి ఆశిస్తున్నారన్న సంగతిని మరువకండి.

# ధర్మ సందేహాలు

## పురుషులు బంగారు ఉంగరం ధరించవచ్చునా?

**ప్రశ్న : పురుషులు బంగారు ఉంగరం గానీ, వేరితర ఆభరణం గానీ ధరించవచ్చునా?**

జవాబు: బంగారు ఉంగరమైనా, మరే యితర బంగారు ఆభరణమైనా తొడగటం పురుషులకు ధర్మ సమ్మతం కాదు. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రవచించారు: "నా అనుచర సమాజంలోని స్త్రీల కొరకు బంగారం, పట్టు సమ్మతించబడింది. పురుషులకు మాత్రం నిషేధించబడింది".

అందుకే మహాప్రవక్త (సఅసం) తన పురుష అనుయాయులకు బంగారు ఉంగరం తొడగటాన్ని వారించారు. ఒకసారి ఒక వ్యక్తి బంగారు ఉంగరం ధరించటం చూసి ఆయన (స) దాన్ని తీసి పారవేస్తూ " అగ్ని కణాన్ని నీ చేతికి తొడుక్కుంటావా? " అని మందలించారు.

ఇస్లామీయ షరీయతుకు విరుద్ధంగా ఉండే అన్ని రకాల చేష్టల నుండి అల్లాహ్ మనందరినీ రక్షించుగాక!

– అల్లామా అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లా బిన్ బాజ్ (రహ్మ.లై)

## ఖుత్బా సందర్భంగా 'తుమ్ము' కు సమాధానం పలకటం!

**ప్రశ్న: శుక్రవారం మస్జిదు వేదికపై నుంచి ప్రసంగం జరుగుతున్నప్పుడు, ఎవరయినా తుమ్మితే, దానికి సమాధానం ఇవ్వాలా? వద్దా?**

జవాబు: జుమా ప్రసంగం జరిగినంతసేపూ నిశ్శబ్దంగా ఉండటం తప్పనిసరి(వాజిబ్). కాబట్టి ఆ సందర్భంగా ఎవరు తుమ్మినా బదులు పలకరాదు. ఏ విధంగానయితే నమాజు చేస్తున్నప్పుడు తుమ్ముకు సమాధానం పలకరో అదే విధంగా ఖుత్బా సందర్భంగా కూడా సమాధానం ఇవ్వకూడదు.

– షేఖ్ బిన్ బాజ్ (రహ్మ.లై)

## సమాధిపై పచ్చని మొక్కను నాటడం

**ప్రశ్న: మృతునికి సమాధి చేసిన పిమ్మట, కొంతమంది ఆ సమాధిపై ఒక మొక్కను నాటుతారు. మరి కొందరు గోధుమ లాంటి పంటను పండిస్తారు. అదేమంటే, ప్రవక్త (సఅసం) తన ఇద్దరు సహచరుల విషయంలో ఇలా చేశారు కదా! అని ఆధారం చూపుతారు. దీని గురించి అసలు షరీయతు ఆజ్ఞ ఏమిటి?**

జవాబు: సమాధిపై చింతచెట్టుగానీ, మరేదైనా మొక్కనుగానీ నాటడం, లేదా గోధుమ విత్తనాలు చల్లి సేద్యం చేయటం షరీయతుకు విరుద్ధం. ఎందుకంటే దైవ ప్రవక్త (స) గానీ, ధర్మ ఖలీఫాలుగానీ ఈ విధంగా చేయలేదు. ప్రవక్త (స) గారు ఆ ఇద్దరు సహచరుల విషయంలో ఖర్జూరపు రెమ్మను నాటడం అంటారా! అదొక అసాధారణ విషయం. ఆ సహచరులు సమాధి శిక్షకు గురైనట్లు దేవుడాయనకు తెలియ పరిచాడు. కనుక ఆ సంగతి ఆ ఇద్దరు సహచరులకే పరిమితం. వారి ద్దరి సమాధులను మినహాయిస్తే వేరితరుల విషయంలో దైవ ప్రవక్త (సఅసం) అలా చేయలేదు. అందుచేత ముస్లింలు దైవ సామీప్యాన్ని ఆశించో, పుణ్యార్జన పేరిటో దైవసమ్మతం కాని విషయాలను సృష్టించుకోవటం ధర్మం కాదు. "మా పద్ధతికి అనుగుణంగా లేని కర్మను ఎవరయినా చేస్తే అతడు ధూత్కారి అవుతాడు" అన్న ప్రవక్త ప్రవచనం ఈ సందర్భంగా గమనార్హం. ఈ నేపథ్యంలో దైవాజ్ఞ ఏమిటో కూడా చూద్దాం –

"ఏమిటి, అల్లాహ్ అనుమతితో నిమిత్తం లేకుండానే తమ కోసం ఏవైనా ధర్మాదేశాలను నిర్ధారించే (అల్లాహ్) భాగస్తులను గాని వారు కలిగి ఉన్నారా?" (అష్ షూరా – 21)

– షేఖ్ బిన్ బాజ్ (రహ్మ.లై)

## మరణానంతరం భార్యాభర్తలు ఒండొకరిని చూడటం, శవ స్నానం చేయించటం

**ప్రశ్న: చనిపోయిన తన భర్తను భార్య చూడటం, అతని మృత దేహానికి స్నానం చేయించటం ధర్మ సమ్మతమేనా?**

జవాబు: ఇద్దత్ (గడువు) ముగిసే వరకూ స్త్రీ తన భర్త దాంపత్యంలోనే ఉంటుంది. అందుచేత స్త్రీ చనిపోయిన తన భర్తను చూడవచ్చు. అతని మృతదేహానికి స్నానం కూడా చేయించవచ్చు.

**(దారుల్ ఇఫ్తా, దారుల్ ఉలూమ్, దేవ్ బంద్)**

అల్లామా అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మ.లై) ని ఈ విషయం గురించి అడిగినప్పుడు ఆయన ఇలా అన్నారు: "భార్య చనిపోయిన తన భర్తకు స్నానం చేయించటం ఆక్షేపణీయం ఏమీ కాదు. అయితే ఆమెకు గుసుల్ పద్ధతి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) మరణించినప్పుడు ఆమె భర్త హజ్రత్ అలీ (ర.అన్హు) గారు ఆమెకు స్నానం చేయించారు. అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) తన భర్త హజ్రత్ అబూబకర్ (ర.అన్హు) మృత దేహానికి స్నానం చేయించారు".

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalam@ymail.com



# నిజ స్నేహితుడు

స్నేహితుడు - ఈ పదంలో ఉన్న అక్షరాలు ఇతర అక్షరాల్లాంటివి కావు. ఇందులోని ప్రతి అక్షరానికి ఒక అర్థం ఉంది.

స: సచ్ఛీలత, సత్య సంధత
న: నీతి, నిజాయితి
హి: హితోపదేశం
త: త్యాగ నిరతి
డు: డాబు దర్పం లేకపోవడం

స్నేహం - అదో నీడ లాంటిది... ఎండ తీవ్రత పెరిగినకొద్దీ దాని అవసరం అధికమవుతూనే ఉంటుంది.
స్నేహం - అది అస్తమించని రవి తేజం... అది కరిగిపోని మంచు పర్వతం... కరిగి పోదు... తరిగి పోదు.
భూఫలాలు, పూలు రుతువును బట్టి కాస్తుంటాయి. స్నేహం - అది అనుక్షణం ఫలాలిచ్చే మహా వృక్షం... అన్ని వేళలా సుగంధ పరిమళాల్ని వెదజల్లే పూవనం.

ఇది స్నేహమైతే, నిజమైన స్నేహితుడెవడు???
అతడే - అనునిత్యం నిన్ను కనురెప్ప వలే కాపాడువాడు. నీ లోపాలను ఎంచనివాడు. నీ తప్పిదాలను క్షమించువాడు. నీవు చెప్పిన ప్రతీది వినువాడు. నీ గుట్టును రట్టు చేయనివాడు. నీ పొరపాట్లను దిద్దుకునే అవకాశం ఇచ్చువాడు. నువ్వు లేనప్పుడు నీదైన ప్రతి వస్తువును కాపాడువాడు. నీ మనో వేదనను ముఖ కవళికలతో పసి గట్టువాడు. నీపై ఉన్న బరువును తొలగించువాడు. ఆపద సమయంలో నిన్ను ఆదుకొనువాడు. కష్ట సమయంలో అండగా నిలుచువాడు. నీ విజయంతో ఆనందించువాడు. పరాజయం పాలైతే ధైర్యం చెప్పేవాడు.

బహుశా అటువంటి స్నేహం కోసం నీవు పరితపిస్తున్నట్లున్నావు.... కానీ చేరుకోలేకపోతున్నానన్న బాధ నిన్ను దహించి వేస్తున్నట్లుంది.... నిరాశ చెందకు.... అధైర్య పడకు..... సహనం వహించు.... ప్రయత్నించు.... నీ కోరిక నెరవేరుతుంది....నీ మొర ఆలకించ బడుతుంది... నీ గమ్యం నీకందుతుంది.... అది సమీపంలోనే ఉంది... నీకై నిరీక్షిస్తుంది... ఖచ్చితంగా నీవు శిఖరానికి చేరుకుంటా వంటుంది... ఆత్మానందంతో ఉత్సాహభరితం అవుతుంది నీ జీవితం... నీవు ఊహించిన దానికంటే ఎంతో గొప్పవాడు నీ స్నేహితుడు.

**'అతన్నెలా పొందగలను' అని ఆలోచిస్తున్నావా???**
ఆలోచించడం మానుకో.... అన్వేషణ ప్రారంభించు.... ఈ మార్గంలో అలుపెరగని కృషి, సడలని పట్టుదల ఉండాలి మరి!... అతన్ని చేరుకునేందుకు ఓ వారధి నిర్మించాలి నీవు.... అది చాలా బలమైనదై ఉండాలి...అతి భయంకరమైన తుఫానులకు ఎదురొడ్డి నిలబడ గలగాలి... సమస్యల సుడిగుండాలకు చెదరకుండా ఉండాలి... కోరికల సుడిగాలులకు బెదరకుండా ఉండాలి....!
అలా నీవు చేసిన రోజు... కురిసిన ప్రతి చినుకు స్వాతి ముత్యం అవుతుంది... నీ బ్రతుకు సంతోషాల హరివిల్లవుతుంది... నీ మనో భూమి పచ్చని సుగుణాల పూతోట అవుతుంది... అది నీకు బంగారు పంటను అందిస్తుంది... అప్పుడు నీలోని ప్రతి అవయవం తనదవుతుంది. నీ కళ్ళు తను కనమన్నవే కంటాయి...ఈ చెవులు తను వినమన్నదే వింటాయి... నీ మెదడు తను చెప్పిందే ఆలోచిస్తుంది... నీ చేతులు తను ధర్మం అన్నదే చేస్తాయి... నీ కాళ్ళు తను చూపిన బాటనే నడుస్తాయి...నీ మదిలో కదిలే ప్రతి కదలిక తన ఆదేశ ప్రకారమే ఉంటుంది..... అదే అసలు స్నేహానికి పరాకాష్ఠ!

ఇక ఆ స్నేహితుడెవడు? ఆ వారధి ఏది? అంటున్నావా?
ఆ పరమ మిత్రుడే.... అల్లాహ్... 'నిఅమల్ మౌలా వ నిఅమన్నసీర్'- ఆయన అందరికంటే మంచి మిత్రుడు, మంచి సహాయకుడు కూడా. ఆ వారధియే.... నమాజు, ప్రార్థన.... 'ఇస్తయీనూ బిస్సబ్రి వస్సలాహ్' - సహనం వహించి, ప్రార్థన చేస్తూ (ఆ మిత్రుని) సహాయం అర్థిస్తూ ఉండు. నిశ్చయంగా అల్లాహ్ సహనం వహించేవారికి తోడుగా ఉంటాడు.

**ఇక నేనేం చేయాలంటావా? అదీ అతని నోటనే విను...!**
"ఎవరు తమ ప్రభువు అల్లాహ్‌యేనని పలికి, ఆ మాట మీదనే స్థిరంగా ఉంటారో వారి (సహాయం) కోసం దైవ దూతలు తప్పకుండా అవతరిస్తారు. అప్పుడు వారికి ఇలా ధైర్యం చెబుతారు: 'భయ పడకండి, విచార పడకండి. స్వర్గ ప్రవేశం, ప్రభువు దర్శనం గురించి మీకు చేయబడిన వాగ్దానం స్మరించి ఆనందించండి. మేము ఇహ లోకంలోనూ మీకు తోడుగా ఉన్నాము. పరలోకంలోనూ మీకు తోడుగా ఉంటాము. స్వర్గంలో మీరు కోరుకున్న వస్తువు లభిస్తుంది. మీరు కోరిందల్లా మీదే అవుతుంది. గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడయిన దేవుని వైపున లభించనున్న ఆతిథ్యమిది".

(హామీమ్ సజ్దా: 30-32)

మానవ శ్రేయోభిలాషి అయిన మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు తమ ఆఖరి ఘడియల్లో చెప్పిన రెండు మాటల్ని బాగా గుర్తుంచుకో!

**"అల్లాహుమ్మ రఫీఖల్ ఆలా"**
(ఓ అల్లాహ్! మహోన్నతమైన నీ నేస్తాన్నే ఆశిస్తున్నాను).
**"ఖుర్రతు ఐనీ ఫిస్సలాతి"**
(నా కంటి చలువ నమాజులోనే ఉంది!!)





# TMA ఆధ్వర్యంలో పిక్నిక్

కువైట్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'తెలుగు ముస్లిం అసోసియేషన్' ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25-02-2009 తేదీన స్థానిక లూలా మస్జిద్ ఆవరణలో పిక్నిక్ ఏర్పాటు చేయబడింది. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ ప్రోగ్రాంలో రెండు వందల యాభై మంది స్త్రీ పురుషులు పాల్గొన్నారు.

ఇలాంటి శుభ సందర్భాలను పురస్కరించుకుని టి.ఎమ్.ఏ సంస్థ ఆనవాయితీగా తెలుగు సోదరులను ఒక చోట సమీకరించి, వారి బాధ్యతలను గుర్తు చేస్తుందని ఆ సంస్థ నాయకులు చెప్పారు. ఐపిసి బోధకులైన మౌలానా షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ, మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ, షేఖ్ ముహమ్మద్ బిలాల్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనానంతరం సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ క్విజ్ ప్రోగ్రాం కండక్ట్ చేశారు. క్రీడా పోటీలు కూడా జరిగాయి. చివర్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడ్డాయి. టి.ఎమ్.ఏ అధ్యక్షులు షేఖ్ రియాజ్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.







# కలిమి + లేమి = జీవితం

అర్థం జీవితం - అంతర్థమౌతుంది
యుద్ధం జీవితం - అధైర్యమౌతుంది

ఒకేసారి ఒకే క్షణంలో - అటు అంతఃపురంలో
పుత్రోదయ పరమోత్సాహం - ఇటు పట్టణ చివర
మురికివాడలో - పూరి గుడిసెలో - ఏ దిక్కూ లేని
తల్లి చింకి బట్టల పొత్తిళ్ళలో - పసిపాప ఆక్రందనం

దిక్కుమాలిన ఆ తల్లి తన బిడ్డను చూసి
బాబూ! ఈ భూమంతా దుఃఖమయం. వేదన-హింస-బాధ
అక్రమం-అన్యాయం-పగ-ద్వేషం-ప్రేమరాహిత్యం నాయనా!
నేను నీకు ఇచ్చేందుకు నాదగ్గర కన్నీళ్ళు తప్ప
మరేమీ లేవు తండ్రీ! పాలకు బదులు కన్నీళ్ళతో
కడుపు నింపుకొని జీవించగలవా బిడ్డా! చలికి వణికే నిన్ను
కప్పేందుకు నా వట్టి చేతులు తప్ప పట్టు వస్త్రాలు లేవు
నా చేతులు నీకు వేడినిస్తాయా బాబూ!
నా ఒడి నీకు బడి కాగలదా నాన్నా!

● ● ●

ఒకేసారి ఒకే ఘడియలో ఇటు అటువైపు మండలంలో
ఆడకూతురు పుట్టినందుకు ఆనందోత్సవాలు-ఇటు
పల్లెటూరులో చెట్టు క్రింద పేద తల్లి పాకి బట్టల మధ్య
వెక్కిళ్ళతో ఎర్రబడ్డ పసికూన చెక్కిళ్ళు
పేదైన ఆ తల్లి తన కూతురుని చూసి

ప్రియాతి ప్రియమైన నా చిట్టి తల్లీ!
నీకు ఇచ్చేందుకు ఈ పేద తల్లి దగ్గర
ఒక్క ప్రేమతప్ప ఇంకేమీ లేదమ్మా!
స్త్రీగా నేను అనుభవిస్తున్న విషాద జీవితాన్ని
పంచుకోవడానికి ఆత్మలోకాన్ని వదలి ఈ లోకానికి
ఎందుకు వచ్చావు తల్లీ? దుర్భర దారిద్ర్యంలో జీవితం
గడిపే ఈ తల్లి కడుపున ఎందుకు పుట్టావమ్మా?!

స్త్రీ ఒక అబలని తలచి, అంగాంగ కొలతలు కొలచి
అతివను అంగడి బొమ్మను చేసిన కుళ్ళు సమాజంలో
ఒంటరిగా నడవలేక, పశువుల్లో బ్రతకలేక
ఊరు పల్లకాదాయె - రక్షణే కరువాయె
మమతలకు తావే లేని మానవ సంబంధాల్లో
కట్నం, లంచం అర్హతలైన మృగ పెత్తనాల నీలి నీడల్లో
ప్రగ్గుతున్న మగువల మధ్య మరో స్త్రీగా ఎందుకు జన్మించావు తల్లీ!?

● ● ●

ఆ తల్లి తన కొడుకును గుండెలకు గట్టిగా హత్తుకుంది
ఈ తల్లి తన కూతురిని బాహువుల్లో బిగబెట్టుకుంది
ఇద్దరు తల్లులది ఒకే ఆలోచన, ఒకే నిర్ణయం
మనం పడ్డ కష్టాలు మన పిల్లలు పడకూడదు
ఇద్దరూ పసికూనల చుట్టూ చేతులు వేశారు; గతంలో
మాదిరిగా తాము మళ్ళీ ఒకటి కావాలని.....

ఆ ఇద్దరు తల్లులు కళ్ళు పైకెత్తి దైవాన్ని వేడుకున్నారు
దురదృష్టవంతులైన ఈ ప్రాంత ప్రజల మీద
మానవత్వం మరచిన ఈ మానవాళి మీద
దయ చూపు ప్రభూ! అని

అప్పుడే - అదే క్షణం - ఒక మేఘం చంద్రుణ్ణి కప్పివేసింది
తళుక్కున ఒక మెరుపు తీగ భూమిని తాకింది
గగన శిఖరం పైనుంచి ఒక గర్జన వినబడింది
అది ఆదిమధ్యాంతరహితుడి ఓదార్పులా ఉంది

"కలత చెందకండి...కంగారు పడకండి..దేవుడు మీకు తోడుగా ఉన్నాడు' దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని (గొంతు నులిమి) హతమార్చకండి వారు భువన తారలు వారికి ఉపాధినిచ్చే బాధ్యత మాది. మీకు ఆహారమిచ్చే బాధ్యత కూడా మాదే, ప్రతి జీవి ఉపాధి మా చేతిలోనే ఉంది. వారు రేపటి ఆశాదీపాలు. వారిని ఆర్పివేయకండి. వారు మీ పాలిట దివ్య వరాలు. వారిని గుండెలకు హత్తుకోండి. గుర్తుంచుకోండి! అజ్ఞానం, అధైర్యం, మూర్ఖత్వంతో తమ సంతానాన్ని బలిగొనేవారు - వారే ఘోరంగా నష్టపోతారు".

ఒకేసారి - ఒకే నిమిషం - అటు మురికివాడలో
ఇటు పల్లెటూరులో ఇద్దరు తల్లులూ ఈ శబ్దాన్ని
విన్నారు. నిజాన్ని గ్రహించారు, ఊరట చెందారు.
లెంపలేసుకున్నారు, కన్నీళ్ళు పెట్టుకున్నారు. తమ
చంటి పిల్లలిద్దర్ని చచ్చినా చంపుకోబోమన్నారు
దైవానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నారు
తమ పిల్లలు తమకు దక్కినందుకు ఆనందభరితులయ్యారు.
అమాంతంగా సజ్దాలో పడిపోయారు.... సుబ్హానల్లాహ్ అంటూ....


జోరుగా గాలి వీస్తోంది ఆ గాలి
నుంచి ఓ రాగం వినబడుతోంది....

అర్థం జీవితం - బిగిరిపోతుంది
యుద్ధం జీవితం - బిగుసు చెందుతుం

అంతలో చంద్రుడి పైనుండి మబ్బు తొలిగింది
చంద్ర కిరణాలు ఆ పూరి గుడిసెలపైన - అందున్న
రెండు తల్లుల ప్రార్థనాస్థలాలపైన పడ్డాయి
మీ తౌబాకు మేమే సాక్ష్యం అంటూ అల్‌విదా అన్నాయి....!

# చెట్టు పుట్ట రాయి రప్ప దైవాలు కావురా ఓ నరుడా!

పిడుగు అహ్మద్



నా పేరు పిడుగు అహ్మద్. నేను ఏదో మరచిపోయానన్న కొరవ. పరీక్షకెళ్ళిన మనిషి పలహారాలపై పడ్డట్టు పరీక్ష రాయకుండా పాసు మార్కులకు ఎదురు సూపా, మునుపు నా గతి అంతే. నా చిన్న వయసు నుంచి ఎన్నో జాతర్లు, తిర్నాళ్లు, పండగ సంబరాలు మరి ఎన్నివాటిల్లో పాల్గొనేవాణ్ణి? ఐనా తెలుసుకున్నది ఏమీ లేదు. నా జీవిత ప్రయాణం పై అసలు ఆలోసించే వాణ్ణేకాదు గత 5 సంత్సరాలుగా కువైట్‌కు వచ్చి ఒంటరితనమై ఆలోచించాను. దేవుణ్ణి మనిషి తయారు చేయలేదు అన్నది దిట్టంగా తెలుసుకున్నాను. నా సేటు 5 పూట్ల దేవునికి ప్రార్థన చేసేవారు. నేను పని చేసేవాణ్ణి. అపుడు నాలో మొదలైంది దైవభీతి. మా సేటుకు అప్పుడు చెప్పాను- ఐపిసికి తీసికెళ్ళి కలిమా పలికించారు అల్‌హమ్దులిల్లాహ్. అప్పట్నుంచి ముందు చేసిన పొరపాట్లను క్షమించమని 5 పూట్ల నమాజులో ఏడుకుంటాను. ముందు తెలీక మనిషి దగ్గర నుంచి విగ్రహాలకు, రాళ్ళకు, చెట్లకు పుట్టలకు దేవునితో పోల్చేవాణ్ణి. పట్టాలపై వెళ్ళే రైలుకు పట్టాలు తప్పిన రైలుకు ఎంత తేడానో నా జీవితపు రైలు కూడా గత 3 సంవత్సరాలుగా పట్టాలపై చేరింది.

ఒక ప్రయాణీకుడు తన గమ్యంపై దృష్టి పెట్టి ప్రయాణిస్తాడు. మధ్యలో దారి తప్పుతానేమోనన్న భయం, ఏ కష్టానికి నష్టానికి గురౌతానన్న భయం, ఇహలోక జీవితం ఒక ప్రయాణం లాంటిది. ఒక మాటలో చెప్పాలంటే బ్రేకుల్లేని వాహనంపై ప్రయాణిస్తే అతను సురక్షితంగా గమ్యం చేరుతాడన్న నమ్మకం ఎంతమాత్రం ఉండదు. దైవభీతి లేని వాని సంగతి అంతే. తను తయారు చేసే ఏ బస్సు ఐనా తనకు కట్టుబడి వుండాలని కోరుకుంటాడు. ముందు తనను తయారు చేసిన దేవునికి కట్టుబడి వుండకపోతే తను ప్రయాణం ముమ్మాటికి గమ్యం చేరదు.

దైవాన్ని అవతార పురుషా అన్న ప్రతి మనిషి తన బ్రతుకును బేజారం చేసుకుంటున్నాడు. ఊహాకందని దైవరూపం. ఐతే మనిషి తను తయారు చేసే ఒక సాదాసీదా వస్తువులా దైవాన్ని ఊహిస్తున్నాడు. అంటే మూఢ నమ్మకస్తుల వల్ల అదే కాబోలు అతను దేవునికి ఏ నష్టము చేయలేదు. తను నష్టపోతూ అమాయకులను పెడద్రోవ పట్టిస్తున్నాడు మన ఆరాధన ఏకదైవానికే. దయచేసి వినండి....

పుట్టిన ప్రతి జీవి గిట్టిక మానదు అన్నది జగమెరిగిన సత్యం దురాచారాలను, దుర్మార్గాలను, చెడు అలవాట్లను, అత్యాశలను ఈ అన్నింటిని రూపుమాపాలంటే ఆ ఏకదైవానికి తప్ప ఆ శక్తి మరెవ్వరికీ లేదు. మనలో దైవభీతి లేనిదే దేవుడు కరుణించడు. మన బహిరంగ శత్రువు సంకెళ్ళ నుండి ఏకదైవాన్ని క్షమాభిక్ష కోరండి. ఇన్‌షాఅల్లాహ్ జాలి సూపునేమో. షైతాన్ మనకు బహిరంగ శత్రువు పగ్గాల్లేని ఎద్దులబండి షైతాను దారి. ఏ గోతిలో పడవేస్తాడో!

మునుపు నా గతి అంతే. ఎన్నో గుళ్ళకు గోపురాలకు అంకితమై వున్న నాకు అల్‌హమ్దులిల్లాహ్ ఆ దేవుడే నా పై జాలి చూపాడు. ఏకదైవాన్నే విశ్వసించాను. దైవగ్రంధాలను దైవప్రవక్తలను విశ్వసించాను. ఒకే ఒక కోరిక. మనందరం దైవ అనుగ్రహానికి చేరాలన్న ఆశ నాలో ఎంతైనా ఉంది.

# నెలవంక ఉత్తరాలు

## క్షమాభిక్షకు అర్హులు కండి

సర్వ సృష్టికి మూలకారకుడైన ఏకైక సర్వేశ్వరునికి కృతజ్ఞతగా ఐదు పూటలా నమాజు చేద్దాం, చేయనివారి కొరకు చేసేటట్లు ప్రయత్నిద్దాం. ఎందుకంటే ఈ క్షణం మనది. మరు క్షణం మనది కాదు.

సృష్టి యావత్తు అల్లాహ్‌కు అహో రాత్రులు అతని ముందు వంగి ప్రణమిల్లుతున్నాయి. సూర్య చంద్రులు పగలు రేయి రూపంలో, సముద్రాలు ఆటుపోటల రూపంలో, పక్షులు, జంతువులు వాటి వాటి రూపంలో, వాటి రెక్కల చప్పుడు రూపంలో, ప్రతి వస్తువు వాటి వాటి నీడల రూపంలో - ఇలా ప్రతిదీ తమ సృష్టికర్తను ఆరాధిస్తున్నప్పుడు, వీటన్నిటికంటే ఎంతో ఉత్తమమైన రీతిలో తీర్చిదిద్దబడిన మనిషి మాత్రం ఏడాదికి ఒక్కసారి కూడా నమాజు చేయని దుస్థితిలో ఉన్నాడంటే ఎంతటి దుశ్చర్య..! ప్రతి వ్యక్తి ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది.

ప్రళయ దినాన లెక్క చూపించవలసిన తరుణం వస్తుంది. ఆ రోజు ఆయన ఎదుట మన ముఖాలు ఏ రీతిలో ఉంటాయో ఒక్కసారి ఆలోచించండి. ఇప్పటికైనా మించి పోయింది లేదు. జాగ్రత్త పడండి. ముష్రిక్కులలో కలిసిపోకండి. ఇస్లాం ధర్మాలకు అనుగుణంగానే జీవిస్తూ నమాజుకు తరలి రండి. అల్లాహ్ కోపాగ్నికి గురవకుండా, ఆయన క్షమాభిక్షకు అర్హులు కండి.

- ఆరిఫా -ఎలిజెబత్ (రౌదా)




## జ్ఞాన జ్యోతి

ఒక స్నేహితుని ద్వారా ఈ నెలవంక పుస్తకము పొంది చదవడం మొదలు పెట్టాను. అలా చాలా రోజులు ఈ నెలవంక పుస్తకం చదివిన తర్వాత చాలా విషయాలు తెలుసుకున్నాను. ఈ నెలవంకలో అనేక మంది పెద్దలు, పండితులు అభిప్రాయాలు వెల్లడించడం జరుగుతుంది. నాకు తెలియని విషయాలు తెలుసుకోగలిగాను. అంధ కారములో ఉన్నవాడు కూడా ఈ నెలవంకలో ఉన్న విషయాలు చదివి అర్థము చేసుకుని జ్ఞాన జ్యోతిని పొందగలుగుతాడు. నన్ను ఈ నెలవంక పుస్తకం ప్రభావితుడ్ని చేసి ఐ.పి.సి వచ్చేదానికి దోహదపడినది. నెలవంక సంపాదకవర్గానికి నా ధన్య వాదములు.

-శివశంకర్ (అబ్దుల్లాహ్) (కువైట్)

## నెలనెలా వెన్నెల

గౌరవనీయులైన సంపాదక వర్గానికి అస్సలాము అలైకుమ్ రహ్మతుల్లాహి వ బరకాతుహు.

మీరు వెలువరించిన 'నెలవంక' ద్వారా మాకు తెలియని ఎన్నో ధార్మిక విషయాలను విపులంగా సమగ్రంగా అందిస్తున్నందుకు మా ధన్యవాదాలు. ముఖ్యంగా మా నవ ముస్లింలకు తెలుగు ప్రజానీకానికి ఈ నెలవంక నెలనెలా వెన్నెలను వెదజల్లుతూ మమ్మలందరినీ కూడా ఆనందపరుస్తోంది.

## అలుపెరగని ఆదర్శప్రాయుడు

కత్తి లేకుండా కలుపు మొక్కలను కత్తిరించే పదును అతని ఉపన్యాసాలకే పరిమితం. అతనే జాకిర్ అబ్దుల్ కరీమ్ నాయక్.

కొన్ని విత్తనాలు వేసిన ప్రాంతం వరకే మొలకెత్తి వ్యాప్తి చెందుతాయి. కానీ జాకీరు గారి తల్లిదండ్రుల ఫలితం ప్రపంచమంతా వ్యాపించింది.

కావున ఇటువంటి ముఖ్యమైన వ్యక్తుల గురించి తెలిపే నెలవంక ప్రతి నెలా క్రొత్త అందాలతో మా వంక వస్తున్నందుకు ఐ.పి.సి వారికి ధన్యవాదాలు.

- ఆయిషా (ఉమా మహేశ్వరి) (రౌదా)

## ఆలోచింపజేసిన వ్యాసం

'దేవుడికి కుమారుడున్నాడా?' అనే బిలాల్ ఫిలిప్స్ గారి వ్యాసం ఆలోచింపజేసింది. ఉద్యోగం కోసం సముద్రాలు దాటి వచ్చిన మాకు ధార్మిక విషయాలను తెలుగులో అందజేస్తున్నందుకు ధన్యవాదాలు. 'ఇస్లాం' అండ్ సైకాలజీ' శీర్షికను నేను చాలా ఆసక్తితో చదువుతుంటాను.

- విజయ (కువైట్)

ఫిబ్రవరి సంచికలో అజీజుర్రహ్మాన్ గారి గోలాన్ గుట్టల సాక్షిగా విషయం ఎంతో ఆలోచింపజేసేదిగా ఉంది. అలాగే సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు పేరెంట్స్ తీరుపై 'చేతులు కాలాక ఆకులు పట్టుకొని ఏమిటి ప్రయోజనం' అంటూ చురకలు అంటించారు. ఇంకా ముహమ్మద్ హనీఫ్ గారు 'స్త్రీలపై అఘాయిత్యాలు దౌర్జన్యాలు' లో తల్లిదండ్రుల నుంచి విద్యార్థుల వరకు మార్పుపై చాలా వివరంగా చర్చించారు.

- వెంకటేశ్వర్లు (అబ్దుల్లాహ్) (కువైట్)

# వివేచన

## ఏది పుణ్యకార్యం?

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:

"ఇద్దరు వ్యక్తుల మధ్య సయోధ్య చేయండి. ఇది కూడా పుణ్యకార్యమే. మీరు వేరొకరిని మీ వాహనంపై కూర్చోబెట్టుకోండి లేదా అతని బరువును మీ వాహనంపై వేసుకోండి. ఇదీ పుణ్యకార్యమే. ఒక మంచి మాట పలకటం కూడా పుణ్యకార్యమే. నమాజు కోసం మీరు వేసే ప్రతి అడుగూ పుణ్యకార్యమే. దారిలో ఉన్న ముళ్లను, రాళ్ళను తొలగించటం కూడా పుణ్యకార్యమే." (బుఖారీ)



### రండి....

విభేదాలను విస్మరించి,
సంఘీ భావంతో మెలగుదాం.
అపార్థాల అడ్డుతెరల వల్ల
దూరమైన హృదయాలను కలుపుదాం.
అందరూ కలిసి దేవుని త్రాటిని
గట్టిగా పట్టుకుందాం.
అంధకారం ఆవరించిన వారి జీవితాల్లో
చిరు దివ్వెను వెలిగిద్దాం.

# పేదల పెన్నిధి

శ్రమ జీవుల హక్కులను, పేదల పరలోక ప్రాశస్త్యాన్ని వివరిస్తూ మానవ మహోపకారి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

"కూలివాని చెమట ఆరక ముందే అతని కూలి ఇచ్చివేయండి".

(ఇబ్నె మాజా)

"ముగ్గురు వ్యక్తులతో ప్రళయ దినాన నేను ఘర్షణ పడతాను... వారిలో ఒకడెవరంటే కూలి వానికి పని ఇచ్చి, పని పూర్తిగా చేయించుకుని, చివరికి అతని కూలి ఎగ్గొట్టినవాడు". (బుఖారీ)

తన వద్ద కూర్చుని ఉన్న వారిలో ఒక వ్యక్తి చేతులు కాయలు కాసి ఉండటం గమనించారు మహనీయ ముహమ్మద్ (సఅసం). ఉండబట్టలేక "ఇదేమిటి నీ చేతులు మరీ ఇంత కరకుగా ఉన్నాయ"ని అడిగారు. దానికి ఆ వ్యక్తి 'అయ్యా ఓ రసూలుల్లాహ్ (స)! నేను కాయకష్టం చేసుకునేవాణ్ణి. కట్టెలు కొట్టి, వాటిని అమ్ముకుని, వచ్చిన ఆదాయంతో బ్రతుకుతాన'ని చెప్పాడు. అప్పుడు మహా ప్రవక్త (స) ఆప్యాయతతో అతని చేతుల్ని ముద్దాడుతూ, "దైవ సాక్షి! ఈ చేతులను నరకాగ్ని కాల్చదు" అని శుభవార్త వినిపించారు.

ఒకసారి మహా ప్రవక్త (సఅసం) "ఓ దేవా! జీవితాంతం నన్ను నిరుపేదగానే ఉంచు. నిరుపేదగానే లేపుకో. హష్ర్ మైదానంలో నన్ను నిరుపేదలతో పాటే ఉంచు" అని ప్రార్థిస్తూ ఉండగా, ధర్మపత్ని ఆయిషా (ర. అన్హా) విన్నారు. 'దైవ ప్రవక్తా తమరు ఎందుకలా కోరుకుంటున్నారు?' అని ఆమెగారు ప్రశ్నించగా "పేదలు ధనికులకన్నా ముందే స్వర్గంలో ప్రవేశిస్తార"ని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు.

"ఆయిషా! ఏ పేదవాడు యాచించినా వట్టి చేతులతో పంపించకు - ఒక ఖర్జూరపు తునక అయినాసరే ఇచ్చి పంపించు. ఆయిషా! పేదల పట్ల దయాభావం కలిగి ఉండు. వాళ్ళను చేరదీస్తే అల్లాహ్ నిన్ను కూడా చేరదీస్తాడు" అని ఉపదేశించారు ఈ పేదల పెన్నిధి (సఅసం).

